నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

## నేటి కందం-నేటికి అందం

అలుపెరుగని కృషి సలుపుచు
తెలగాణాంధ్రములు రెండు దేశ ప్రగతికై
పలుగతుల వృద్ధి పొందగ
జలజాక్షుం డొసగె సంతసము నిర్వ్వరకున్ !!

(విశ్రాంతి విసుగు విరామం లేకుండా ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలు అభివృద్ధి కోసం కృషి చేసి దేశ ప్రగతికి తోడ్పడు తుండడంతో దేవుడు ఇద్దరికీ సంతోషాన్నిఅందిస్తున్నాడు.)



-రాధశ్రీ
సెల్:9494481210


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com


## చురక

పశ్చిమాసియాలో మళ్లీ
ప్రభలుతుంది యుద్ధసెగ
శాంతిపక్షి లేవకుండా
చంపుతుంది వారి పగ.
విధ్వంసం కోరుకొనుడు
విశ్వ ప్రగతి హానే కదా
అగ్రత్వము ఉగ్రత్వము
అధినేతల పిచ్చే సదా



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శుక్రవారం 10-7-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 ▪ Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:263 పేజీలు:6 వెల: రూ.1/-

# డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత

### -గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా




హనుమకొండ, జూలై 09 : మత్తు పదార్థాల నిర్మూలనను ప్రజా ఉద్యమంగా మార్చి, డ్రగ్స్ రహిత భారత్ డ్రగ్స్ రహిత తెలంగాణ సాధనకు ప్రతి పౌరుడు బాధ్యతగా కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ ఐడీఓసీ (కలెక్టరేట్)కు చేరుకున్న గవర్నర్‌కు ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ అభియాన్ డ్రగ్స్ రహిత తెలంగాణ' కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల దుష్పరిణామాలను వివరిస్తూ రూపొందించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఉవనీణతీజీజూష్ట్రతిఇ ఖీవటవతీవనిఇవ

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. మత్తు రహిత సమాజ నిర్మాణం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి కుటుంబం, ప్రతి సమాజం, ప్రతి వ్యక్తి బాధ్యత అని స్పష్టం చేశారు. మా ఇంట్లో మత్తు పదార్థాలకు చోటు లేదు అనే సంకల్పాన్ని ప్రతి కుటుంబం చేసుకుంటే సమాజం మొత్తం మత్తు రహితంగా మారుతుందని గవర్నర్ పేర్కొన్నారు. మార్పు ఎప్పుడూ మన నుంచే ప్రారంభం కావాలని, ప్రతి ఒక్కరూ ముందుగా తాము మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజాన్ని కూడా ఆ దిశగా నడిపించాలని సూచించారు.

కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం దాన కిషోర్, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, హనుమకొండ వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, జిడబ్లుఎంసి కమిషనర్ వెంకన్న, ప్రజాప్రతినిధులు, అదనపు కలెక్టర్లు రవి, సంధ్యారాణి, వై వి గణేష్, డిసిపి ధార కవిత పాల్గొన్నారు

# తెలంగాణ ఒలింపిక్ భవన్ ప్రారంభం..

**-భావితర క్రీడాకారులకు స్ఫూర్తి కేంద్రం: పి.టి. ఉష**
**-హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ నూతన భవనాన్ని ప్రారంభించిన భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు**
**-క్రీడల్లో క్రమశిక్షణ, అంకితభావమే విజయానికి మార్గమన్న పి.టి. ఉష**
**-క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న మంత్రి వాకిటి శ్రీహరి**



హైదరాబాద్, జులై 9: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ నూతన భవనాన్ని భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు డా. పి.టి. ఉష ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోని బాలాదేవి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడిన డా. పి.టి. ఉష, తెలంగాణ ఒలింపిక్ భవనం భారత క్రీడా చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఇది కేవలం పరిపాలనా భవనం మాత్రమే కాకుండా, భావితర క్రీడాకారుల కలలకు దిశానిర్దేశం చేసే కేంద్రంగా, ఒలింపిక్ ఉద్యమాన్ని బలోపేతం చేసే వేదికగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యత అభినందనీయమని పేర్కొన్న ఆమె, రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల విస్తరణ, యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడం, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దే చర్యలు ప్రశంసనీయమని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ పదాధికారులు, భవన నిర్మాణంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు.

ఒలింపిక్ ఉద్యమం విజయవంతం కావాలంటే పారదర్శకత, జవాబుదారీతనం, న్యాయబద్ధత వంటి విలువలను కచ్చితంగా పాటించాలని పి.టి. ఉష సూచించారు. క్రీడాకారుల సంక్షేమం, వారికి అత్యుత్తమ శిక్షణ, సౌకర్యాలు, ప్రోత్సాహం కల్పించడమే అన్ని క్రీడా సంస్థల ప్రధాన లక్ష్యంగా ఉండాలని చెప్పారు. అలాగే కోచ్‌లు, సాంకేతిక నిపుణులు, అధికారులు, వాలంటీర్ల సేవలను ప్రత్యేకంగా అభినందించారు.

యువ క్రీడాకారులకు ఆమె కీలక సందేశం ఇస్తూ.. తమపై తాము నమ్మకం ఉంచుకుని క్రమశిక్షణ, అంకితభావం, కఠోర శ్రమతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రతి ఛాంపియన్ ప్రయాణం ఒక కలతో ప్రారంభమవుతుందని, ఆ కలను నిజం చేసుకునే వరకు ప్రయత్నం ఆపవద్దని సూచించారు.

ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. భారత క్రీడా చరిత్రలో మిల్కా సింగ్, పి.టి. ఉష వంటి దిగ్గజాలు దేశానికి ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం అన్ని అవకాశాలు కల్పిస్తున్నప్పటికీ యువత క్రీడల్లో ఆశించిన స్థాయిలో రాణించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సోషల్ మీడియాకు అధిక సమయం కేటాయించే బదులు ఆటలపై దృష్టి పెట్టాలని, క్రీడలను జీవిత లక్ష్యంగా ఎంచుకున్నప్పుడే విజయం సాధించగలరని యువతకు సూచించారు. భారీ జనాభా ఉన్న దేశమైనప్పటికీ పతకాల విషయంలో వెనుకబడటం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశమన్నారు. చిన్న దేశాలు సైతం అంతర్జాతీయ వేదికలపై పతకాలు సాధిస్తున్నాయని గుర్తుచేస్తూ, దేశం కోసం ఆడి ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను యువత పూర్తిగా సద్వినియోగం చేసుకుని అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు, దేశానికి కీర్తి తీసుకురావాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు.

## తెలంగాణ గవర్నర్‌కు ఘన స్వాగతం పలికిన ఎంపీ కడియం కావ్య



హనుమకొండ, జూలై 09 :వరంగల్ పర్యటనలో భాగంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటీ) వరంగల్‌కు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి ఆత్మీయంగా ఆహ్వానించారు.

అనంతరం గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వరంగల్ ప్రాంత అభివృద్ధి, విద్యా రంగ పురోగతి, ప్రజా సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై సంక్షిప్తంగా చర్చించారు. కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు కూడా ఎంపి డాక్టర్ కడియం కావ్య స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

# కాలుష్య రహిత హైదరాబాద్ లక్ష్యం : సీఎం రేవంత్

**-ఓఆర్ఆర్ లోపల గ్రీన్ అర్బన్ సిటీగా అభివృద్ధి**
**-ఓఆర్ఆర్ లోపల పరిశ్రమల కాలుష్యానికి చెక్..**
**-బయట మాన్యుఫాక్చరింగ్ జోన్ల అభివృద్ధికి ప్రభుత్వం సిద్ధం**
**-రంగారెడ్డిలో 5.6 గిగావాట్ల ప్రీమియర్ ఎనర్జీస్ సోలార్ యూనిట్ ప్రారంభించిన ముఖ్యమంత్రి**



హైదరాబాద్, జులై 9: హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) పరిధిలోని కోర్ అర్బన్ ప్రాంతాన్ని పూర్తిగా కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. 2,100 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన ఓఆర్ఆర్ పరిధిలోని సుమారు 1.35 కోట్ల జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ నగరాభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సీతారాంపూర్‌లో ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ ఏర్పాటు చేసిన 5.6 గిగావాట్ల సామర్థ్యమున్న సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం సంస్థ రూపొందించిన సోలార్ పవర్డ్ స్ట్రీట్ లైట్, ఎయిర్ క్లీనింగ్ వ్యవస్థతో కూడిన 'ఆక్సీ ట్రీ'తో పాటు సోలార్ మాడ్యూల్ తయారీ ప్రక్రియను పరిశీలించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాలు ఎదుర్కొంటున్న కాలుష్య సమస్యల నుంచి హైదరాబాద్ పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జీడిమెట్ల, బాలానగర్ వంటి పారిశ్రామిక ప్రాంతాల కాలుష్యం, మూసీ నది కాలుష్యం నగరవాసులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.

ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా ఓఆర్ఆర్ లోపలి కోర్ అర్బన్ ప్రాంతాన్ని కాలుష్యరహిత మండలంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపల ఏర్పాటు చేసిన పెరి అర్బన్ మాన్యుఫాక్చరింగ్ జోన్‌లకు తరలించేందుకు చట్టపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. తరలించే పరిశ్రమలకు అవసరమైన భూములు, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## 2034 నాటికి ట్రిలియన్ ఎకనామీ లక్ష్యం

హైదరాబాద్, జులై 9: తెలంగాణలో దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక విధానం అమలులో ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా సీతారాంపూర్‌లో ప్రీమియర్ ఎనర్జీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారతదేశ అత్యాధునిక నెక్స్ట్ జెన్ సోలార్ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలపై కీలక వ్యాఖ్యలు చేశారు.

ప్రపంచంలోనే అత్యుత్తమ జీవన నగరాల్లో హైదరాబాద్ ఒకటిగా నిలిచిందని పేర్కొన్న సీఎం, అయితే నగరాన్ని కాలుష్య సమస్య వేధిస్తోందని అన్నారు. మూసీ నది ప్రక్షాళనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, కోర్ అర్బన్ ఏరియా అభివృద్ధి కోసం ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

పరిశ్రమలను నగర పరిధి వెలుపలకు విస్తరించే దిశగా చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) అవతల పరిశ్రమలకు భూములు కేటాయిస్తామని, ఓఆర్ఆర్?రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) మధ్య విస్తృత పారిశ్రామిక మండలాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆర్ఆర్ఆర్ వెలుపల వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, 2047 నాటికి దాన్ని మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు అందించేందుకు ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని సీఎం వెల్లడించారు. బ్లూ కాలర్ ఉద్యోగాల కోసం ఆధునిక నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలను ప్రభుత్వం విస్తృతంగా అమలు చేస్తోందని చెప్పారు.

పెరి అర్బన్ మాన్యుఫాక్చరింగ్ జోన్‌లో తొలి పరిశ్రమగా ప్రీమియర్ ఎనర్జీస్ యూనిట్ ప్రారంభం కావడం అభినందనీయమని పేర్కొన్న సీఎం, కేవలం 12 నెలల్లోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేసిన సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు.

'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యంతో రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తూ 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, పాలిటెక్నిక్ కళాశాలలు, స్కిల్స్ యూనివర్సిటీ వంటి సంస్థలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు.

హైదరాబాద్ ప్రపంచ నగరాలతో పోటీపడాలంటే మరిన్ని పెట్టుబడులు, ఆధునిక పరిశ్రమలు రావాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రీమియర్ ఎనర్జీస్ రూపొందించిన సోలార్ ఆధారిత 'ఆక్సీ ట్రీ' వంటి వినూత్న ఆవిష్కరణలు అభినందనీయమని చెప్పారు. ప్రకృతి పరిరక్షణలో ప్రభుత్వం మాత్రమే కాకుండా ప్రజల భాగస్వామ్యమూ ఎంతో కీలకమని ఆయన పిలుపునిచ్చారు.

# నాణ్యమైన వైద్య సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం

**-ఈఎస్ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీల్లో అన్ని సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు**
**-ఈఎస్ఐ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాం**
**-సంగారెడ్డిలో నూతన ఈఎస్ఐ డిస్పెన్సరీ ప్రారంభోత్సవంలో మంత్రి వివేక్ వెంకటస్వామి**



సంగారెడ్డి, జులై 9: (నేటినిజం ప్రతినిధి): ప్రజలకు నాణ్యమైన, ఆధునిక వైద్య సేవలను ఉచితంగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు సత్వర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఈఎస్ఐ వైద్య సేవలను విస్తరిస్తున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. గురువారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఈఎస్ఐ డిస్పెన్సరీని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్‌తో కలిసి మంత్రులు ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా అన్ని మౌలిక వసతులు, వైద్య సదుపాయాలు కల్పిస్తూ ఈఎస్ఐ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. సంగారెడ్డి పారిశ్రామిక ప్రాంతంలో పనిచేసే కార్మికులు వైద్య చికిత్స కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే అన్ని రకాల వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో సంగారెడ్డిలో ఈఎస్ఐ డిస్పెన్సరీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలో సుమారు 80 లక్షల కుటుంబాలు ఈఎస్ఐ వైద్య సేవలపై ఆధారపడుతున్నాయని, ఈఎస్ఐ ఆసుపత్రులు, డిస్పెన్సరీల్లో అవసరమైన అన్ని సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ఇటీవల ఆర్‌సీ పురం ఈఎస్ఐ ఆసుపత్రిని సందర్శించినప్పుడు కొన్ని ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో రోగులు సనత్‌నగర్‌కు వెళ్తున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. వచ్చే ఆరు నెలల్లో అక్కడ అన్ని ప్రత్యేక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి, కార్మికులు స్థానికంగానే పూర్తి స్థాయి చికిత్స పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

త్వరలో ఆర్‌సీ పురం ఈఎస్ఐ ఆసుపత్రిలో 20 పడకల డయాలసిస్ యూనిట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు వచ్చే ఏడాదిలో కార్డియాలజీ సెంటర్‌ను కూడా ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే శంషాబాద్, రామగుండం, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రుల మంజూరుకు కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకే కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థిక భారం మోసుకోవద్దని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంటూ కార్మికులు ఈఎస్ఐ డిస్పెన్సరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లా పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటికే ఏడు ఈఎస్ఐ డిస్పెన్సరీలు ఉండగా, సంగారెడ్డిలో ఎనిమిదో డిస్పెన్సరీని ప్రారంభించడం సంతోషకరమన్నారు.

రూ.200 కోట్లతో సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. జహీరాబాద్, నారాయణఖేడ్, సదాశివపేట, ఆందోల్, జోగిపేట ప్రాంతాల ప్రజలకు కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, ఈఎన్‌టీ, క్యాన్సర్ చికిత్స, ట్రామా కేర్, నేత్ర వైద్య సేవలు వంటి సూపర్ స్పెషాలిటీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పీజీ సీట్లను కూడా కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని 104 ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకల సంఖ్యను పెంచుతూ వైద్య సేవలను మరింత విస్తరిస్తున్నామని తెలిపారు.

# సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా ఫ్యాషన్ టెక్నాలజీ

## (09 జూలై "అంతర్జాత ఫ్యాషన్ దినోత్సవం" సందర్భంగా)

ప్రతి ఒక్కరు తమ ఫ్యాషన్ భావాలను వ్యక్తీకరించడానికి ఒక ప్రత్యేక మార్గాన్ని ఎంచుకుంటారు. ఒక్కొక్కరి వస్త్రధారణ ఒక్కో విధంగా ఉంటుంది. కులాలు, మతాలు, జాతులు, దేశాలు, ప్రాంతాలను బట్టి ఫ్యాషన్స్ మారుతుంటాయి. ఒక్కో జాతికి ఒక రకమైన విలక్షణ వస్త్రధారణ పద్ధతులు ఉంటాయి. ఫ్యాషన్ ప్రపంచం, పరిశ్రమ చాలా పెద్దది. ఫ్యాషన్ టెక్నాలజీ క్షణక్షణం మారుతోంది. తరాలు మారిన కొద్దీ ఫ్యాషన్లు కూడా మారుతున్నాయి, కొన్ని సందర్భాల్లో వెర్రి పోకడలు కూడా సంతరించుకుంటున్నాయి. ప్రపంచ మానవాళి దృష్టిని తమ ఫ్యాషన్ల వైపుకు మరల్చడానికి, ప్రత్యేక సౌందర్య భావాలను వ్యక్తం చేయడానికి, వారి వారి విభిన్న దుస్తులు లేదా ఉపకరణాలను ప్రదర్శించడానికి ఒక వేదికగా ప్రతి ఏట 09 జూలై రోజున "అంతర్జాతీయ ఫ్యాషన్ దినోత్సవం (ఇంటర్నేషనల్ ఫ్యాషన్ డే)" పాటించుట 2016 నుంచి ఆనవాయితీగా మారింది.

### ఫ్యాషన్ ప్రపంచం చాలా పెద్దది:

ఫ్యాషన్ రంగం చాలా పెద్దది. నేడు ప్రపంచ ఫ్యాషన్ పరిశ్రమ/మార్కెట్ దాదాపు 1.84 ట్రిలియన్ డాలర్ల వ్యాపారంగా మారింది. ప్రపంచ మానవ జనాభా 8 బిలియన్లకు సాలీనా దాదాపు 100 బిలియన్ల వరకు దుస్తులు ఉత్పత్తి అవుతున్నాయి. ప్రతి ఒక్కరికి సగటున ఒక ఏడాదికి 12 – 14 దుస్తులు కొనుగోలు చేస్తున్నారు. వస్త్ర ఉత్పత్తిలో అతి పెద్ద దేశంగా చైనా తొలి స్థానాన్ని ఆక్రమించింది. ఫ్యాషన్ పరిశ్రమ ద్వారా సృజన, ఆవిష్కరణ, సంస్కృతి, వేషధారణ, పలు రకాలు దుస్తులు, కేశాలంకరణ, అలంకరణ, ఆభరణాలు లాంటి పలు అంశాలు ఉంటాయి. ఫ్యాషన్ ప్రపంచంలో వ్యక్తులు, డిజైనర్లు, క్రియేటర్స్, మోడల్స్, స్టైలిస్ట్, ఇన్నొవేటర్స్, ట్రెండ్స్, ఇన్ఫ్లుయెన్సర్స్ ద్వారా పలు రకాల ఫ్యాషన్స్ పుట్టుకొస్తున్నాయి, మార్కెట్‌ను ముంచేస్తున్నాయి. నిన్నటి ఫ్యాషన్ నేడు పాతబడిపోయి, నేటి ఫ్యాషన్స్ కోకొల్లలుగా పుట్టుకొస్తున్నాయి. ఫ్యాషన్ అంటే దుస్తులు మాత్రమే కాదని, ఇది ఒక హద్దులు లేని వింత ప్రపంచమని అర్థం అవుతున్నది. ఫ్యాషన్ రంగం అంటేనే సృజనశీలత, ఆవిష్కరణ, సంస్కృతికి వైవిధ్యం, ప్రత్యేక గుర్తింపు లాంటి అంశాలకు పుట్టిళ్లు. సామాజిక మార్పులు, కళలకు అపూర్వ వేదికగా అంతర్జాతీయ ఫ్యాషన్ దినం ఉపయోగపడుతున్నది.

### ఫ్యాషన్ టెక్నాలజీ - ఫ్యాషన్ డిజైనర్స్:

ఫ్యాషన్ డిజైన్ అంటే దుస్తులు, కొన్ని వస్తువులను అందంగా, వినూత్నంగా తీర్చి దిద్దే కళ అని తెలుసుకోవాలి. దీనిలో అవలంభించే పద్ధతుల సమాహారాన్ని ఫ్యాషన్ టెక్నాలజీ అని పిలుస్తాం. మానవ అభిరుచులను బట్టి దుస్తులు, అలంకార వస్తువులను తయారు చేసే నిపుణులను ఫ్యాషన్ డిజైనర్స్ అంటాం. దుస్తులు, ఉపకరణాల రూపకల్పన, ఉత్పత్తిలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించడాన్ని ఫ్యాషన్ టెక్నాలజీగా పిలుస్తున్నాం. ఫ్యాషన్ టెక్నాలజీలో ఫ్యాషన్ డిజైన్స్, వస్త్ర సాంకేతికత, ఫ్యాషన్ ఉత్పత్తులు, ఫ్యాషన్ మార్కెట్, రిటైల్ లాంటి పలు రంగాలు ఉంటాయి. నేటి డిజిటల్ యుగంలో కంప్యూటర్–సహాయ ఉత్పత్తి/డిజైన్స్, 3డి ప్రింటింగ్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాంటి పరిజ్ఞానాలు వాడబడుతున్నాయి. ఇవి ఫ్యాషన్ ప్రపంచ పరిశ్రమను మరింత సమర్థవంతంగా, సుస్థిరంగా, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా, ఆకర్షణీయంగా మార్చడంలో సహాయపడుతున్నది.

### అంతర్జాతీయ ఫ్యాషన్ దినోత్సవ వేడుకలు:

ఆధునిక పౌర సమాజ అభిరుచులకు అద్దం పడుతున్నది నేటి ఫ్యాషన్ పరిశ్రమ. మారుతున్న కాలంతో పాటు ఫ్యాషన్లు కూడా అత్యంత వేగంగా మారుతున్నాయి. ప్రతి ఏటా 09 జూలై రోజు నిర్వహించే అంతర్జాతీయ ఫ్యాషన్ దినం వేదికగా ప్రదర్శనలు, పోటీలు, సామాజిక మాధ్యమ అవగాహనలు, నూతన బ్రాండ్ల ప్రదర్శనలు, డిస్కౌంట్స్, స్థానిక బ్రాండ్ల ప్రోత్సాహం, కొత్త బ్రాండ్ల ప్రారంభం, ఫ్యాషన్ టెక్నాలజీ సృజనకారుల గుర్తింపు లాంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు. మానవ జాతి పుట్టుక నుంచి నేటి వరకు ఫ్యాషన్ రంగం కొత్తపుంతలు తొక్కుతూనే ఉన్నది. ఇదో వింత, విచిత్ర ప్రపంచం. పౌర సమాజంతో విడదీయరాని సంబంధం కలిగిన ఫ్యాషన్ ప్రపంచం నిన్నటి, నేటి, రేపటి తరాలకు తగిన విధంగా తమ ఉత్పత్తులను విడుదల చేస్తూనే ఉన్నాయి. అంతర్జాతీయ ఫ్యాషన్ దినోత్సవం–2026 ఇతివృత్తంగా "ఫ్యాషన్ ద్వారా ఐక్యత (యునిటీ త్రూ ఫ్యాషన్)" అనే అంశాన్ని తీసుకొని, ఈ వేదికగా మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా ప్రదర్శనలు నిర్వహిస్తూ మన దేశ ఐక్యత సాధనకు కృషి జరుగుతోంది.

ఫ్యాషన్ టెక్నాలజీ పెరగడం శుభ సూచకమే అయినప్పటికీ ఫ్యాషన్లు వెర్రితలలు వేయకూడదు, మన సాంస్కృతిక మూలాలను మరిచి పోకూడదు. మన ప్రాంత వాతావరణాన్ని, అవసరాలను, సందర్భాలను బట్టి మన వేషధారణ ఉండాలి. ఫ్యాషన్ పేరుతో అసహ్యకర రూపును పొందరాదని గమనించాలి.



–మధుపాలీ
9949700037

# మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

**–ఇందిరమ్మ మైనారిటీ మహిళ శక్తి పథకం కింద ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ**
**–స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా ఎదగాలి–ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**




వరంగల్, జులై 9:రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి, ముఖ్యంగా మహిళల ఆర్థిక స్వావలంబనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మైనారిటీ మహిళలు స్వయం ఉపాధి సాధించి కుటుంబాలకు ఆర్థిక అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

**200 మంది మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ**

భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూర్ నగర్‌లో బుధవారం తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో ఇందిరమ్మ మైనారిటీ మహిళ శక్తి పథకం కింద మైనారిటీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి లబ్ధిదారులకు కుట్టు మిషన్లను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మహిళలు స్వయం ఉపాధి పొందేలా ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గం నుంచి 275 మంది దరఖాస్తు చేసుకోగా, ప్రతి అర్హురాలికి కుట్టు మిషన్ అందజేస్తామని, తొలి విడతలో 200 మందికి పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రంజాన్ సందర్భంగా తోఫా పంపిణీతో పాటు జిల్లాలో 50 మసీదుల నిర్మాణానికి ఒక్కో మసీదుకు రూ.30 వేల చొప్పున మంజూరు చేసినట్లు తెలిపారు. అద్దె భవనంలో కొనసాగుతున్న మైనారిటీ గురుకులాన్ని పాత జిల్లా కలెక్టర్ కార్యాలయ భవనానికి మార్చామని, ప్రస్తుతం అక్కడ 402 మంది మైనారిటీ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని వివరించారు.

**ప్రతి అర్హ మహిళకు సంక్షేమ ఫలాలు అందిస్తాం: కలెక్టర్ రాహుల్ శర్మ**

జిల్లాలోని ప్రతి అర్హ మైనారిటీ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న కుట్టు మిషన్లను ఉపాధి సాధనంగా మలుచుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు.

**వసతి గృహంలో విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చట**

కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ మైనారిటీ వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థుల యోగక్షేమాలు, వసతి సౌకర్యాలు, భోజన ఏర్పాట్లపై ఆరా తీశారు. విద్యార్థులతో కలిసి సాయంత్రం అల్పాహారం స్వీకరించి, మెనూ ప్రకారం ఆహారం అందుతున్నదా, చదువులో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరాలని విద్యార్థులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి డాక్టర్ కుమారస్వామి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

**–ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి–కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలమ్**




కరీంనగర్, జులై 9:నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలమ్ పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రామడుగు మండలం వెలిచాల గ్రామంలో పోలీస్– మీ కోసం అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన 40 అధునాతన సీసీటీవీ కెమెరాలను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రారంభించారు.

ముఖ్యఅతిథిగా హాజరైన సీపీ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ, నె రాల నియంత్రణలో సీసీటీవీల పాత్ర కీలకమని తెలిపారు. వెలిచాలలో పాత కెమెరాల స్థానంలో 40 కొత్త కెమెరాలు ఏర్పాటు చేశామని, కమిషనరేట్ పరిధిలో ప్రతి మూలను నిఘా పరిధిలోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు. రాబోయే రోజుల్లో మరో 700 కొత్త కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన సర్పంచ్ వీర్ల నర్సింగరావు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులను అభినందించారు. అలాగే ఆన్లైన్ గేమింగ్ వ్యసనంతో యువత ఆత్మహత్యలు, డబ్బు నష్టపోతున్న ఘటనలు జిల్లాలో వెలుగు చూస్తున్నాయని, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచాలన్నారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న డ్రగ్స్కు దూరంగా ఉండాలన్నారు.

# దురండ్ కప్ ఆటల పోటీ ట్రోఫీలను ఆవిష్కరించిన రాష్ట్రపతి

న్యూఢిల్లీ, జులై 9:దురండ్ కప్ ఆటల పోటీ – 2026' ట్రోఫీలను ఈ రోజు.. అంటే 2026 జులై 7న రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, అనేక మంది ప్రతిభావంతులకు ఫుట్‌బాల్ ఆటలో పాలుపంచుకొనేందుకు ఈ ఆటల పోటీ ఒక అవకాశాన్ని అందించిందంటూ, దురండ్ కప్‌తో అనుబంధం ఉన్న పూర్వ, ప్రస్తుత అధికారులు, క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

దురండ్ కప్, ప్రెసిడెంట్స్ కప్, సిమ్లా ట్రోఫీ గెలవడానికి ఈ సంవత్సరం కొన్ని కొత్త జట్లు పోటీపడనున్నాయని, వాటిలో శ్రీలంకకు చెందిన ఒక జట్టు కూడా ఉందని రాష్ట్రపతి తెలుసుకొని సంతోషాన్ని వ్యక్తం చేశారు. కొత్త జట్ల చేరిక ఈ చరిత్రాత్మక పోటీకి ప్రజాదరణ మరింత పెరిగేటట్లు చేస్తుందన్న నమ్మకం తనకు ఉందని శ్రీమతి ద్రౌపది ముర్ము అన్నారు. పాల్గొంటున్న జట్లన్నీ మంచి ఆటతీరును కనబరచాలని రాష్ట్రపతి శుభాకాంక్షలను తెలిపారు.

ప్రపంచంలో అన్నింటి కన్నా అత్యంత ఆదరణ లభిస్తున్న క్రీడలలో ఫుట్‌బాల్ ఒకటని రాష్ట్రపతి అన్నారు. ఇది శ్రేష్ఠత్వానికి, ఏకతకి, క్రీడాభావనలకి సాటి లేని ఉదాహరణగా నిలుస్తోందన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఫీఫా వరల్డ్ కప్‌లో ప్రపంచంలోని అత్యుత్తమ జట్లు, క్రీడాకారులు తమ తమ దేశాల ఫుట్‌బాల్ ప్రతిష్ఠను పెంపొందింప చేయడానికి పోటీపడుతున్నారని శ్రీమతి ద్రౌపది ముర్ము అన్నారు. ఆయా జట్లకు, క్రీడాకారులకు ప్రపంచమంతటా అభిమానులు ఉన్నారని, వారంతా ఈ జట్లు, క్రీడాకారుల శ్రేష్ఠమైన ఆటతీరుపై ప్రశంసలు కురిపిస్తుంటారని రాష్ట్రపతి అన్నారు. ఫుట్‌బాల్ క్రీడ ప్రజలను పరస్పరం అనుసంధానిస్తుందని, క్రీడాకారుల అసాధరణ ఆట తీరు ప్రపంచవ్యాప్తంగా క్రీడా ప్రేమికులందరికీ స్ఫూర్తిని అందిస్తుందని శ్రీమతి ద్రౌపది ముర్ము అన్నారు.

ఫుట్‌బాల్ క్రీడలో భారత్ ప్రపంచ స్థాయిలో తన స్థానాన్ని సంపాదించుకోవడానికి ఇంకా ఎంతో దూరం ప్రయాణించవలసి ఉందని రాష్ట్రపతి అన్నారు. ఈ ఆటల పోటీ ఫుట్‌బాల్ క్రీడాకారుల ప్రతిభకు పదును పెట్టడంలో చెప్పుకోదగిన పాత్రను పోషించగలదన్న ఆశాభావాన్ని రాష్ట్రపతి వ్యక్తం చేశారు.

క్రీడలకు సంబంధించిన ఉత్సాహం ఒక్క ఆటలకే పరిమితం కాదని రాష్ట్రపతి అన్నారు. ఇది మనకు జీవితంలో సమానత్వ, సహకార విలువలను బోధించడంతో పాటు ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు దృఢంగా ఉండాలని బోధిస్తుందన్నారు. మనం 2047 కల్లా భారత్‌ను 'వికసిత్ భారత్'గా తీర్చిదిద్దే దిశగా పురోగమిస్తున్నామని శ్రీమతి ద్రౌపది ముర్ము అన్నారు. ఏ విధంగా ఫుట్‌బాల్ క్రీడలో ఆటగాళ్లు ఒకరితో మరొకరు సహకరించుకుంటూ జట్టును విజేతగా నిలబెడతారో, అదే మాదిరిగా మన దేశ పౌరులందరూ కలిసికట్టుగా 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని నెరవేర్చుకోవడంలో విజయం సాధిస్తారన్న నమ్మకం తనకు ఉందని రాష్ట్రపతి అన్నారు.

# వివిధ రంగాలపై ఎల్‌నినో ప్రభావం, సన్నద్ధత చర్యలపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించిన ప్రధానమంత్రి కార్యాలయం

న్యూఢిల్లీ, జులై 9:ఖరీఫ్ సీజన్ పురోగతి, ఆర్థిక వ్యవస్థలోని ఇతర రంగాలపై ఎల్‌నినో వల్ల కలగబోయే సంభావ్య ప్రభావం నేపథ్యంలో తీసుకున్న సన్నద్ధత చర్యలను అంచనా వేయడానికి, సమీక్షించడానికి 2026 జూలై 7న సేవాతీర్థ్‌లో ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి డాక్టర్ పీ.కే. మిశ్రా అధ్యక్షతన ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో వ్యవసాయం, విద్యుత్, సహకారం, తాగునీరు– పారిశుద్ధ్యం, ఆరోగ్య–కుటుంబ సంక్షేమం, ఆర్థిక వ్యవహారాలు, పశుసంవర్ధక శాఖ, గ్రామీణాభివృద్ధి, భూ విజ్ఞాన శాస్త్రం, వ్యవసాయ పరిశోధన, విద్య, భారత వాతావరణ శాఖ (ఐఎండీ), సమాచార– ప్రసార శాఖ, వినియోగదారుల వ్యవహారాలు, ఆర్థిక సేవలు, ఎరువులు – కేంద్ర జల సంఘంతో సహా పదిహేనుకు పైగా మంత్రిత్వ శాఖల కార్యదర్శులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశం ప్రారంభంలో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారులు జూన్ నెలతో పాటు జూలై 7వ తేదీ వరకు ఉన్న మొత్తం వర్షపాత పరిస్థితిని వివరించారు. దేశంలో రుతుపవనాల విస్తరణ, ఎల్‌నినో వల్ల కలగబోయే సంభావ్య ప్రభావంపై వాతావరణ విభాగం డైరెక్టర్ జనరల్ తాజా సమాచారాన్ని అందించారు. గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలలో రుతుపవనాల రాక దాదాపు 10 రోజులు ఆలస్యమైంది. అయితే 07.07.2026 నాటికి కురిసిన వర్షపాతంతో దేశవ్యాప్త మొత్తం వర్షపాత లోటు –12 శాతానికి తగ్గింది. జూలై మొదటి వారంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. జూలై, ఆగస్టు నెలల్లో బలహీనమైన లేదా సాధారణ ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉంది. జూన్–సెప్టెంబర్ రుతుపవనాల సీజన్ మొత్తంలో లభించే వర్షపాతంలో 30 శాతానికి పైగా కేవలం జూలై నెలలోనే కురుస్తుంది. కాబట్టి ప్రస్తుత పరిస్థితిని నిరంతరం నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. ఎల్‌నినో సంవత్సరం అయినంత మాత్రాన ఆ ఏడాది వర్షపాతం తప్పనిసరిగా సాధారణం కంటే తక్కువగా ఉంటుందని భావించలేమని కూడా ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఖరీఫ్ సీజన్ సమయంలో ఎల్‌నినో వల్ల కలగబోయే సంభావ్య ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకున్న సన్నద్ధత చర్యలపై వ్యవసాయ శాఖ కార్యదర్శి ఒక సమగ్రమైన ప్రజెంటేషన్ ఇచ్చారు. వర్షపాతం, జలాశయాలలో నీటి నిల్వలు, పంటల సాగు, ఉత్పాదకాల అందుబాటు, మార్కెట్ పోకడలు, కొత్తగా తలెత్తే తెగుళ్లు, వ్యాధుల పరిస్థితులను పర్యవేక్షించడానికి సకాలంలో నిర్ణయాలు తీసుకోవడం, అత్యవసర స్పందనను సులభతరం చేయడం కోసం 'క్రాప్ వెదర్ వాచ్ గ్రూప్' రాష్ట్రాలతో కలిసి వారపు సమావేశాలను నిర్వహిస్తోంది. ముప్పు పొంచి ఉన్న 262 జిల్లాల కోసం 'జిల్లా వ్యవసాయ అత్యవసర ప్రణాళికలను' అప్‌డేట్ చేశారు. జిల్లాల్లోని కృషి విజ్ఞాన కేంద్రాల (కేవీకే) కోసం 'భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి' (ఐకార్) 'భారతీయ వ్యవసాయంలో ఎల్‌నినో నష్టాల నిర్వహణ'పై ప్రామాణిక నిర్వహణ విధానాలను (ఎస్‌ఓపీ) జారీ చేసింది. వాతావరణ మార్పులను తట్టుకునే రకాలు, సాంకేతిక పరిజ్ఞానాల కారణంగా వర్షపాత లోటు ఉన్నప్పటికీ గత కొన్నేళ్లుగా ఆహార ధాన్యాల ఉత్పత్తి స్థిరంగా కొనసాగుతోందని కూడా ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ముప్పు పొంచి ఉన్న రాష్ట్రాలలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై), కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ) పరిధిని విస్తరించడం కోసం అవగాహన కార్యక్రమాలను ప్రారంభించారు. నిర్ణీత కాలపరిమితిలోగా గరిష్ఠంగా అర్హులకు ఈ సౌకర్యాలు అందేలా చూడాలని వ్యవసాయ, ఆర్థిక సేవలు, సహకార శాఖలకు సూచించారు. పశుసంవర్ధక, మిల్క్ డెయిరింగ్ శాఖను జాతీయ, స్థానిక స్థాయిలలో ఎండుగడ్డి, పచ్చిగడ్డి, పశుగ్రాసం లభ్యతను అంచనా వేయాల్సిందిగా ఆదేశించారు.

జిల్లాల వారీగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని, ప్రస్తుతానికి పరిస్థితి స్థిరంగా ఉందని తాగునీరు–పారిశుద్ధ్య శాఖ తెలిపింది. ముప్పు పొంచి ఉన్న జిల్లాల్లో సూక్ష్మ స్థాయి ప్రణాళికలు, పర్యవేక్షణను ఈ శాఖ నిర్ధారించాలని ఆదేశాలు జారీ చేశారు. జలవనరుల శాఖ దేశంలోని భూగర్భ జలాలు, జలాశయాల తాజా స్థితిని వివరించింది. ప్రస్తుతం పరిస్థితి స్థిరంగా ఉన్నప్పటికీ ఈ సీజన్ అంతటా నిరంతర నిఘా ఉంచాలని స్పష్టం చేశారు.

వడగాల్పులపై అవసరమైన సూచనలను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సిద్ధం చేసింది. వడగాల్పులు, అధిక తేమ, డెంగ్యూ వ్యాప్తి వంటి పరిస్థితులను ఈ శాఖ పర్యవేక్షిస్తోంది. హెచ్చరికలు, మార్గదర్శకాలను క్షేత్ర స్థాయి వరకు సమర్థవంతంగా చేరవేసేలా చూడాలని ఆదేశించారు.

బియ్యం, గోధుమలు, పప్పుధాన్యాల రిటైల్ ధరల స్థితి, తగినంత బఫర్ నిల్వల లభ్యతను వినియోగదారుల వ్యవహారాల శాఖ వివరించింది. రబీ సీజన్‌కు సరిపడా ఎరువుల లభ్యత, ప్రారంభ నిల్వలు ఉండే అవకాశం ఉందని ఎరువుల శాఖ నివేదించింది. నిత్యావసర వస్తువులు, ఎరువుల విషయంలో జాతీయ, స్థానిక స్థాయి లభ్యతను నిరంతరం పర్యవేక్షించాలని ఇరు శాఖలకు అధికారులు సూచించారు.

'వికసిత్ భారత్– గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవిక మిషన్' కింద జూలై 1 నుంచి ప్రారంభమైన పనులను గ్రామీణాభివృద్ధి శాఖ వివరించింది. దీని ద్వారా ఇప్పటివరకు 1 కోటి పనిదినాలు కల్పించారు. వాతావరణ మార్పులను తట్టుకునే విత్తన రకాల ఉపయోగాన్ని పెంచటానికి సంబంధించిన వివరాలను వ్యవసాయ పరిశోధన, విద్యా శాఖ పంచుకుంది. విద్యుత్ ఉత్పత్తి, లభ్యత విషయంలో తాజా పరిస్థితిని విద్యుత్ శాఖ వివరించింది.

మొత్తం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైనప్పుడు నివారణ చర్యలు చేపట్టేందుకు వీలుగా రుతుపవనాల ప్రభావం లేదా ఆలస్యమైన రుతుపవనాల వల్ల ముప్పు పొంచి ఉన్న జిల్లాలపై పడే ప్రభావాన్ని రాష్ట్రాలతో సమన్వయం చేసుకుంటూ అంచనా వేయాలని ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి ఆదేశించారు.పశుగ్రాస అభివృద్ధి ప్రణాళికలతో పాటు తగినంత మేత లభ్యతను నిర్ధారించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, రాష్ట్రాలతో కలిసి క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. ముప్పు పొంచి ఉన్న జిల్లాల్లో తాగునీరు తగినంతగా అందుబాటులో ఉండేలా చూడడానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ముప్పు పొంచి ఉన్న జిల్లాల్లోని జలాశయాల నీటి మట్టాలను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నారు. అందుబాటులో ఉన్న నీటిని అత్యంత మెరుగ్గా, ఆలోచనతో వినియోగించడాన్ని ప్రోత్సహించేలా తగిన ఆదేశాలు జారీ చేశారు. సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేలా చూసేందుకు మంత్రిత్వ శాఖలన్నీ పరస్పరం సన్నిహిత సమన్వయంతో, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేయాలని స్పష్టం చేశారు.

# ఇసుక వాహనదారులు ఆందోళన

**–ఒకే రోజు ఆన్లైన్,టోకెన్ లతో ఇసుక సరఫరా**
**–ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆగిపోయిన ఇసుక సరఫరా**

కరీంనగర్, జులై 9:కొత్తపల్లి మండల పరిధిలోని లింగల్ చేడ్ గ్రామ శివారులోని పెద్ద వాగు నుంచి ప్రభుత్వం ఇసుక రవాణా సరఫరా కొనసాగుతుంది. బుధవారం రోజు టోకెన్ మరియు ఆన్లైన్ ద్వారా రవాణా జరుగుతుందని సమాచారం మేరకు ఇసుక వాహనదారులు ట్రాక్టర్ లోడ్ చేసుకున్న తర్వాత ఆన్లైన్ ఇసుక మాత్రమే సరఫరా జరుగుతుంది అన్ని ఎస్ఆర్ఓ తెలిపారు.ఇసుక ట్రాక్టర్లు అక్కడి నుంచి కదలకుండా సాయంత్రం వరకు నిల్చిపోవడం జరిగింది.

ఆన్లైన్ ఇసుక సరఫరా సమయం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అనుమతి ఉంటుంది. ఇక్కడ మాత్రం ఉదయం నుంచి ఇసుక సరఫరా చేయకుండా సాయంత్రం 4 గంటల 45నిమిషాలకు ఇసుక సరఫరా కొనసాగించారు. సాయంత్రం 5 గంటలు దాటినా తర్వాత ఇసుక సరఫరా చేయడం కానీ అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయి.

ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం కోసం టోకెన్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు సమాచారం ఇచ్చిన అధికారులు ఇసుక ట్రాక్టర్ పంపియకపోవడంతో అధికారుల నిర్లక్ష్యంతో ట్రాక్టర్ యజమానులు డ్రైవర్లు ఇసుక లోడ్ తో ఉదయం నుంచి సాయంత్రం 6 గంటలు దాటినా పడిగాపులు కస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# మానవాళికి మార్గదర్శనం చేస్తున్న భారత నాగరికత విలువలు: లోక్‌సభ స్పీకర్

న్యూఢిల్లీ, జులై 9:మానవాళికి మార్గదర్శనాన్ని అందిస్తూ శాంతి, సద్భావన, నైతిక జీవనాన్ని ప్రోత్సహించడంలో భారతదేశ నాగరికత విలువలు తమ వంతు సందర్భశుద్ధిని చాటుతున్నాయని లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓమ్ బిర్లా అన్నారు. ఆధ్యాత్మికత, యోగా, ధర్మం, సంస్కృతిలతో కూడిన ప్రాచీన సంప్రదాయం విలసిలుతున్న భూమి భారత్ అని ఆయన అన్నారు. ఆరోగ్యదాయక జీవనం, నైతికత, ఆధ్యాత్మిక చేతన సందేశాన్ని యోగా సంప్రదా యాలు, మునులు మనకు అందించారని శ్రీ బిర్లా అన్నారు.

శ్రీ రఘువంశపురం ఆశ్రమంలో శ్రీ అర్ధనారీశ్వర్ దేవాలయంలో ఏర్పాటు చేసిన ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం, శ్రీ రామ కథ కార్యక్రమాలలో పాల్గొన్న ప్రజలను ఉద్దేశించి శ్రీ బిర్లా ప్రసంగిస్తూ ఈ మేరకు వ్యాఖ్యానించారు.

భారత ఆధ్యాత్మిక సంప్రదాయాలు, మునులు అందించిన సంస్కృతి, ప్రజాసంక్షేమ భావనకు కట్టుబడిన స్ఫూర్తిదాయక కార్యక్రమం ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవమని శ్రీ బిర్లా అన్నారు. భగవాన్ అర్ధనారీశ్వరుని ప్రాణ ప్రతిష్ఠ ఒక ధార్మిక ఉత్సవం మాత్రమే కాదని, అది విశ్వాసాన్ని బలపరిచే, విలువలను పరిపుష్టం చేసే ఒక పవిత్ర సందర్భమని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని ఈ కార్యక్రమం జాగృతం చేస్తుందన్నారు. ఇలాంటి ఉత్సవాలు సమాజాన్ని దాని మూలాలతో తిరిగి అనుసంధానించడంతో పాటు, దేశ నిర్మాణంలో అందరూ పాలుపంచుకొనేటట్లు స్ఫూర్తిని కలిగిస్తాయని ఆయన అన్నారు.

'దేవాలయాలు విశ్వాస కేంద్రాలు, అవి సత్యం, ధర్మబద్ధత, విలువలు, సేవతో పాటు సామాజిక సద్భావనను పెంపొందింపచేసే సంస్థలు కూడా' అని శ్రీ ఓమ్ బిర్లా అన్నారు. భారత సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంలో, సమాజ నైతిక ఆధారాన్ని దృఢతరంగా నిలబెట్టడంలో దేవాలయాలు ఒక కీలక పాత్రను పోషిస్తున్నాయని ఆయన అన్నారు. దేవాలయాలు ప్రాచీన కాలం నుంచీ విద్యకి, దానానికి, సామాజిక సంక్షేమానికి కేంద్రాలుగా ఉన్నాయని, 'వసుధైవ కుటుంబకమ్' భావనను నిరంతరం పెంచి పోషిస్తున్నాయన్నారు.

భగవాన్ అర్ధనారీశ్వర మహత్యాన్ని శ్రీ బిర్లా ప్రస్తావిస్తూ, ఆ దివ్య రూపం శివ, శక్తి , పురుషుడు, ప్రకృతిల మేలు కలయికకు ప్రతీకగా ఉందన్నారు. అందరూ క్షేమంగా ఉండాలనేదే భగవాన్ శివుని సంకల్పమని, పార్వతీ మాత కరుణ సమాజంలో సమతౌల్యాన్ని, సద్భావనని చాటుతూ, స్పందన పూర్వక జీవితాన్ని గడిపేందుకు స్ఫూర్తిని అందిస్తుందని ఆయన అన్నారు. ఈ సమతౌల్యం ప్రకృతిని, మానవతను గౌరవించాలని బోధించడంతో పాటు సుస్థిర, సమ్మిళిత అభివృద్ధి దిశగా పయనించేలా మనకు మార్గాన్ని చూపుతుందని లోక్‌సభ స్పీకర్ అన్నారు.

భగవాన్ శ్రీ రాముని ఆదర్శాలను శ్రీ బిర్లా ప్రస్తావిస్తూ, భగవాన్ రాముడు ధర్మం, కర్తవ్యం, ప్రజల సంక్షేమం అనే ఉన్నత ఆదర్శాలకు ప్రతీకగా నిలిచారన్నారు. ఈ ఆదర్శాలను ప్రజలు అలవరుచుకొనే, సమాజం పట్ల, దేశం పట్ల తమ కర్తవ్యాలను నిర్వర్తించే స్ఫూర్తిని శ్రీ రామ కథ అందిస్తోందన్నారు. మర్యాదా పురుషోత్తముడు రాముడు నడచిన బాటలో నడిచి పౌరులు శక్తిమంతమైన, విలువలపై ఆధారపడిన, స్వయంసమృద్ధ భారత్ నిర్మాణంలో తమ వంతు పాత్రను పోషించవచ్చని శ్రీ బిర్లా అన్నారు.

'శ్రీ రఘువంశ్‌పురవ్ ఆశ్రమం, కేశవ్ ప్రియ గోశాల, శ్రీ అర్ధనారీశ్వర దేవాలయం, శ్రీ రామ కథ.. ఇవి భారత సంస్కృతిలో ముఖ్య కేంద్రాలు.. ఇవి సేవ, నైతిక ప్రవర్తన, గోవుల సంరక్షణ, మానవత వంటి విలువలను ఎప్పటికీ బలోపేతం చేస్తున్నాయి' అని శ్రీ బిర్లా స్పష్టం చేశారు.

ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం ఇస్తున్న సిసలైన సందేశం దేవాలయంలో దైవ ప్రతిమను ఏర్పాటు చేయడానికే పరిమితం కాదని, అది మన జీవితాల్లో సత్యం, సేవ, దయ, సంస్కారాలను ప్రతిష్ఠించుకోవాలని కూడా సూచిస్తోందని లోక్‌సభ స్పీకర్ అన్నారు. ఈ విధమైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం సామాజిక సద్భావనను, నైతిక విలువలను, దేశ నిర్మాణ భావనను మరింత బలోపేతం చేయగలవన్న నమ్మకం తనకు ఉందని ఆయన అన్నారు.

# అదుపు తప్పిన స్కూల్ బస్సు.. తప్పిన భారీ ప్రమాదం

కరీంనగర్, జులై 9: పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గురువారం ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు అదుపు తప్పి విద్యుత్ స్థంభాన్ని ఢీకొట్టింది. డ్రైవర్ అజాగ్రత్తగా వాహనం నడపడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 25 మంది విద్యార్థులు ఉన్నారు. ఢీకొన్న ఘటనలో బస్సు పాక్షికంగా దెబ్బతిన్నప్పటికీ విద్యార్థులంతా క్షేమంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న తల్లిదండ్రులు ఘటనాస్థలికి చేరుకుని తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించార.

# కడెం పోలీస్‌స్టేషన్‌లో హరితహారం కార్యక్రమం

## -ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి: ఎస్ఐ సాయి కిరణ్




ఆదిలాబాద్, జులై 9:ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కడెం పోలీస్‌స్టేషన్ ఎస్ఐ పి. సాయి కిరణ్, పెద్దూరు-కడెం గ్రామ సర్పంచ్ దీకొండ విజయకుమార్ అన్నారు. గురువారం కడెం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా ఎస్ఐ సాయి కిరణ్ మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్క జీవకోటికి ఎంతో ఉపయోగపడుతుందని, పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని సూచించారు.

కార్యక్రమంలో సర్పంచ్ దీకొండ విజయకుమార్, ఉపసర్పంచ్ పిట్టల రాజన్న, మహిళా కాంగ్రెస్ నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ భవాని, బీఎల్‌వో నేరెళ్ల గంగమణి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాంగ్ కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాలపై జీవో

## -సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఆదిలాబాద్, జులై 9:మాంగ్ కులస్తులకు తహసీల్దార్ కార్యాలయాల ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిన సందర్భంగా కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని ఉషగాం గ్రామంలో గురువారం మాంగ్ సమాజ్ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర సామాజిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాంగ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు గాయక్‌వాడ్ తులసీదాస్ మాంగ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు.




ఈ కార్యక్రమానికి ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు మావలే దత్త మాంగ్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాంగ్ కులస్తుల చిరకాల డిమాండ్‌ను నెరవేర్చుతూ తహసీల్దార్ కార్యాలయాల ద్వారానే కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం హర్షణీయమన్నారు. గతంలో ఆర్డీవో కార్యాలయాల ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు మాంగ్ సమాజ్ ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, తాజా నిర్ణయంతో ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని తెలిపారు. మాంగ్ కులస్తుల అస్తిత్వాన్ని పరిరక్షించే నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో ఉషగాం సర్పంచ్ ఆత్రం నిర్మల శశిపాల్, జంగాం మాజీ సర్పంచ్ కుమ్ర శ్యాంరావు, ఉషగాం మాంగ్ సమాజ్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏడులే ప్రకాష్, నాయకులు కాంబ్లే సంగ్రామ్ మాంగ్, మోరే మహాదేవ్ మాంగ్, తారుడే గ్యానోబ మాంగ్, సూర్యవంశీ దత్త మాంగ్, మాంగ్ సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

# ఏపీఈడీఏ ఆధ్వర్యంలో జార్ఖండ్ నుంచి దుబాయ్‌కి అమ్రపాలి మామిడి పండ్ల వాణిజ్య ఎగుమతి

న్యూఢిల్లీ, జులై 9:కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని వ్యవసాయ, శుద్ధి చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఏపీఈడీఏ) పర్యవేక్షణలో జార్ఖండ్ నుంచి దుబాయ్‌కి ఆమ్రపాలి మామిడి పండ్ల వాణిజ్య ఎగుమతి విజయవంతంగా ప్రారంభమైంది. జార్ఖండ్‌లోని ఆకాంక్షిత జిల్లా గుమ్లా, దియోఘర్ ఆకాంక్షిత బ్లాక్ దేవ్‌ఘర్ నుంచి సేకరించిన 2 మెట్రిక్ టన్నుల అత్యుత్తమ నాణ్యత కలిగిన ఆమ్రపాలి మామిడి పండ్లను జూలై 3, 2026న దుబాయ్‌కి ఎగుమతి చేశారు. మెసర్స్ ఫెయిర్ ఎక్స్‌పోర్ట్స్ (ఇండియా) ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ద్వారా దుబాయ్‌లోని ప్రసిద్ధ లూలూ విక్రయ కేంద్రాల్లో రిటైల్ అమ్మకాల కోసం ఈ సరుకును పంపించారు. గిరిజన, మహిళా రైతు సంఘాల నుంచి ఎగుమతులను ప్రోత్సహించడంలో ఇది కీలక మైలురాయిగా నిలిచింది. ఈ కార్యక్రమం వల్ల జార్ఖండ్‌లోని మహిళా రైతు ఉత్పాదక సంస్థలకు మార్కెట్ ధర కంటే 180 శాతం అధిక రాబడి లభించింది.

ఈ ఎగుమతి సరుకు కోసం పలాష్ - జార్ఖండ్ రాష్ట్ర జీవనోపాధి ప్రోత్సాహక సంస్థ (జేఎస్ఎల్‌పీఎస్) ద్వారా ప్రోత్సహించిన మూడు మహిళా రైతు ఉత్పాదక సంస్థల నుంచి అత్యుత్తమ నాణ్యమైన ఆమ్రపాలి మామిడి పండ్లను సేకరించారు. ఇందులో ఒక మెట్రిక్ టన్నును గుమ్లా జిల్లాలోని ఏపీఈడీఏ-సమోదిత ఎంపీఎం బాఘిమా పాల్‌కోట్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, రైదిహ్ అగ్రి ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ల నుంచి సేకరించగా... మిగిలిన ఒక మెట్రిక్ టన్నును దియోఘర్ జిల్లాలోని మోహన్‌పూర్ అజీవిక మహిళా కిసాన్ ప్రొడ్యూసర్ సొసైటీ నుంచి సేకరించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో జార్ఖండ్ ప్రభుత్వం మద్దతుతో అమలు చేస్తున్న 'బిర్సా హరిత్ గ్రామ్ యోజన' కింద గిరిజన మహిళా రైతులు ఈ మామిడి తోటలను అభివృద్ధి చేశారు.

ఆయా జిల్లాల డిప్యూటీ కమిషనర్, డిప్యూటీ డెవలప్‌మెంట్ కమిషనర్‌లతో పాటు ఏపీఈడీఏ, జెఎస్ఎల్‌పీఎస్ ఇతర అనుబంధ విభాగాల ప్రతినిధుల సమక్షంలో ఈ ఎగుమతి వాహనాన్ని అధికారికంగా జెండా ఊపి ప్రారంభించారు. గ్రామీణ ఉత్పాదకులను అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించడంలో ఏపీఈడీఏ, జార్ఖండ్ ప్రభుత్వం, జిల్లా యంత్రాంగాలు, మహిళా ఎఫ్‌పీసీలు, ఎగుమతిదారులు, అభివృద్ధి భాగస్వాముల మధ్య ఉన్న విజయవంతమైన సమన్వయానికి ఈ కార్యక్రమం ఒక ప్రతీకగా నిలిచింది.

ఈ మామిడి పండ్ల ఎగుమతి వల్ల స్థానిక రైతులకు గణనీయమైన ఆర్థిక ప్రయోజనాలు చేకూరాయి. మహిళల నేతృత్వంలోని ఈ ఎఫ్‌పీసీ సభ్యులు స్థానిక మార్కెట్లో లభించే ధరల కంటే దాదాపు 180 శాతం అధిక రాబడిని పొందారు. ఎగుమతి మార్కెట్లకు అందుబాటును కల్పించడం ద్వారా రైతుల ఆదాయాన్ని ఎలా పెంచవచ్చో, అలాగే ఎగుమతి ఆధారిత వ్యవసాయంలో మహిళా ఉత్పాదకుల భాగస్వామ్యాన్ని ఎలా పెంపొందించవచ్చో ఈ కార్యక్రమం నిరూపించింది. ఈ ప్రక్రియలో పాల్గొన్న ప్రతి ఎఫ్‌పీసీలో 1,500 మందికి పైగా వాటాదారులు ఉండగా, ఇవన్నీ కలిపి మొత్తం 50,000 మందికి పైగా సభ్యులైన రైతులకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. దీనివల్ల ఈ ఎగుమతి ప్రయోజనాలు ఒక పెద్ద రైతు సమాజానికి విస్తరించాయి.

రైతు సంఘాలను ఎగుమతులకు సన్నద్ధం చేసేందుకు సామర్థ్య పెంపుదల, నాణ్యతా ప్రమాణాల పెంపు, మార్కెట్ సదుపాయాల కల్పన వంటి అంశాలపై ఏపీఈడీఏ నిరంతరం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా మే 2026లో గుమ్లా జిల్లాలోని పాల్‌కోట్ ప్రాంతంలో ఏపీఈడీఏ ఒక ప్రత్యేక సామర్థ్య పెంపుదల కార్యక్రమాన్ని నిర్వహించింది.

అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలు, కోత అనంతర నిర్వహణ పద్ధతులు, ఎగుమతి విధానాలపై ఎనిమిది రైతు ఉత్పాదక సంస్థల సభ్యులు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లకు ఇందులో అవగాహన కల్పించారు. తద్వారా వారు అంతర్జాతీయ ప్రీమియం మార్కెట్ల అవసరాలను తీర్చేలా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన విభాగాలు, జెఎస్ఎల్‌పీఎస్, జిల్లా పరిశ్రమల కేంద్రం, ఇతర అనుబంధ విభాగాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తల్లో అవగాహన పెంచేందుకు ఏపీఈడీఏ కోల్‌కతా ప్రాంతీయ కార్యాలయం సెప్టెంబర్ 19, 2025న దేవ్‌ఘర్ జిల్లా దేవీపూర్ బ్లాకులోని బస్వరియా గ్రామంలో మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాల కోసం 'ఎగుమతి ఆధారిత సామర్థ్య అభివృద్ధి కార్యక్రమాన్ని' నిర్వహించింది. ఈ సదస్సులో మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పాదక సంస్థల ప్రతినిధులతో పాటు ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ, నాబార్డ్, ఏపీఈడీఏ అధికారులు సహా సుమారు 105 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీఈడీఏ విధివిధానాలు, ఆర్థిక సహాయ పథకాలు, ఎగుమతి అవకాశాలు, కీలకమైన ఎగుమతి ప్రక్రియలు, ప్రపంచ వ్యవసాయ వాణిజ్యంలో మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొనడానికి అందుబాటులో ఉన్న సంస్థాగత మద్దతుపై సమగ్ర అవగాహన కల్పించారు.

జార్ఖండ్ ఉద్యానవన రంగానికి ఉన్న పెరుగుతున్న ఎగుమతి సామర్థ్యాన్ని ఈ కార్యక్రమం స్పష్టం చేస్తోంది. సామర్థ్య పెంపుదల, మార్కెట్ అనుసంధానం, ఎగుమతి సదుపాయాల ద్వారా మహిళా రైతు సంఘాలను బలోపేతం చేయడానికి ఏపీఈడీఏ చేస్తున్న నిరంతర కృషికి ఇది అద్దం పడుతోంది.

# కేంద్ర హోం-సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా సమక్షంలో చారిత్రక ఒప్పందంతో సమసిన సమస్య

న్యూఢిల్లీ, జులై 9:నర్మదా జలాల అవార్డు భాగస్వామ్య రాష్ట్రాలైన మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ మధ్య చిరకాల చెల్లింపుల సమస్య పరిష్కారం దిశగా న్యూఢిల్లీలో నేడొక చారిత్రక ఒప్పందం కుదిరింది. కేంద్ర హోం-సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా, జలశక్తి శాఖ మంత్రి శ్రీ సి.ఆర్.పాటిల్ సమక్షాన కుదిరిన ఈ ఒప్పందంపై నలుగురు ముఖ్యమంత్రులు శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్ (మహారాష్ట్ర), శ్రీ భూపేంద్ర పటేల్ (గుజరాత్), శ్రీ భజన్ లాల్ శర్మ (రాజస్థాన్ ), డాక్టర్ మోహన్ యాదవ్ (మధ్యప్రదేశ్) సంతకాలు చేశారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వంతోపాటు ఆ నాలుగు రాష్ట్రాల ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

సర్దార్ సరోవర్ ప్రాజెక్ట్ నిర్మాణ సంబంధిత వ్యయ-భాగస్వామ్య వాటాలపై మహారాష్ట్ర , మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల మధ్య చిరకాలం నుంచీ వివాదం కొనసాగుతోంది. దీన్ని పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించిన ఈ ఒప్పందం చారిత్రక ఘట్టంగా నిలిచింది. దీని ప్రకారం... పూర్తి పరిష్కారం దిశగా ఒకే దఫా చెల్లింపు పద్ధతిలో వివాదానికి స్వస్తి పలికేందుకు అంగీకారం కుదిరింది.

నర్మదా అవార్డుకు సంబంధించి నాలుగు రాష్ట్రాల మధ్య చాలా కాలం నుంచి కొనసాగుతున్న వివాదం నేడు సామరస్యపూర్వకంగా పరిష్కృతమైందని కేంద్ర హోం-సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వాన జల భద్రత బలోపేతం సహా ఈ రంగంలో సహకారాత్మక సమాఖ్య విధానాన్ని ప్రోత్సహిస్తూ అనేక చరిత్రాత్మక చర్యలు చేపట్టినట్లు ఆయన గుర్తుచేశారు. అలాగే శ్రీ మోదీ నేతృత్వాన అనేక రాష్ట్రాల్లో ద్వంద్వచోదక ప్రభుత్వాలు ఏర్పడటంతో వాటి మధ్య పరస్పర అవగాహన పెరిగి, రాజకీయ విభేదాలు సమసిపోవడం వల్ల దేశంలోని దీర్ఘకాలిక వివాదాలు అనేకం వేగంగా పరిష్కృతం అయ్యాయని ఆయన తెలిపారు.

ఈ కీలక అంతర్రాష్ట్ర ప్రాజెక్టుపై వివాద పరిష్కారం దిశగా విస్తృత ఏకాభిప్రాయ సాధనలో మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర ప్రభుత్వాల నిర్మాణాత్మక సహకారాన్ని శ్రీ అమిత్ షా అభినందించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ముఖ్యంగా మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలకు ఎంతో ప్రయోజనం చేకూరిందని చెప్పారు. ఆనకట్ట నిర్మాణం పూర్తయ్యాక ఈ రాష్ట్రాల్లో ప్రతి ప్రాంతానికీ నీరు, విద్యుత్తు సదుపాయాలు చేరువయ్యాయని పేర్కొన్నారు. రాజస్థాన్ ప్రయోజనాలు తక్కువగా అనిపించినప్పటికీ, నర్మదా జలాలు ప్రవహించే ప్రాంతాల్లో భూమి విలువతోపాటు రైతుల ఆర్థిక స్థితిగతులలో గొప్ప మార్పు వచ్చిందని ఆయన తెలిపారు.

కేంద్ర జలశక్తి శాఖ మంత్రి శ్రీ సి.ఆర్.పాటిల్ నాయకత్వంలో దేశవ్యాప్తంగా జల పంపిణీ వివాదాలు, సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతున్నాయని శ్రీ అమిత్ షా గుర్తుచేశారు. ఈ కృషిలో భాగంగానే హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల మధ్య జల వివాదం కూడా ఇటీవలే సమసిపోయిందని చెప్పారు. కిషౌ డ్యామ్ ప్రాజెక్టు సహా రాజస్థాన్-హర్యానా జల వివాదం లేదా నేటి ఒప్పందం ఇవన్నీ- సహకారాత్మక సమాఖ్య వాదం విజయానికి అద్భుత ఉదాహరణలని ఆయన పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలోనైనా దేశ ప్రజలకు.. ముఖ్యంగా రైతులకే అధికంగా నదీ జలాలు ఉపయోగపడతాయని వ్యాఖ్యానించారు. దేశంలో ఏ ప్రాంతంలో నీటిని వినియోగించినా, అంతిమంగా లబ్ధి పొందేది భారతీయులేనని స్పష్టం చేశారు.ఏదైనా వివాదం వల్ల జాతీయ స్థాయిలో వాటిల్లే నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని దాని సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడం అవశ్యమని కేంద్ర హోం-సహకార శాఖల మంత్రి శ్రీ అమిత్ షా అన్నారు. పొరుగు రాష్ట్రం అభివృద్ధి చెందితే, ఆ ప్రగతి ఫలితాలు తమకూ లభిస్తాయనే సద్భావనను అన్ని రాష్ట్రాలూ అలవరచుకోవాలని పేర్కొన్నారు.

# భారీ మౌలిక సదుపాయాల విస్తరణతో వర్ధమాన ఇంజనీర్లకు విస్తృత అవకాశాలు

న్యూఢిల్లీ, జులై 9:భారత మౌలిక సదుపాయాల ఆధారిత వృద్ధి కారణంగా వర్ధమాన ఇంజనీర్లలో ఇంజనీరింగ్ విద్య పట్ల ఆసక్తి పెరుగుతోంది. భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ద్వారా దేశ నిర్మాణానికి తోడ్పడే అవకాశాలు విస్తరిస్తున్న క్రమంలో... ముఖ్యంగా ఐఐటీలు, ఎన్ఐటీలలో సివిల్ ఇంజనీరింగ్ ఒక ప్రాధాన్య కెరీర్ ఎంపికగా ఆవిర్భవిస్తోంది.

ఇంజనీరింగ్ విద్యను జాతీయ రహదారి రంగంలోని అర్థవంతమైన ఉపాధి అవకాశాలతో అనుసంధానించే వ్యవస్థీకృత మార్గాలను కల్పిస్తూ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా కీలక సహాయకారిగా ఆవిర్భవించింది. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతి సంవత్సరం గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్ పరీక్ష) ద్వారా సాంకేతిక ఉద్యోగాల కోసం సుమారు 100 మంది ఇంజనీరింగ్ నిపుణులను నియమించుకుంటుంది. ఐఐటీలు, ఎన్ఐటీలు, ఇతర ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి పట్టభద్రులైన పలువురు డిప్యూటీ మేనేజర్ ఉద్యోగంలో నియామకానికి అర్హత సాధించారు. ఇది దేశంలోని అత్యంత ప్రతిభావంతులైన ఇంజనీరింగ్ పట్టభద్రుల్లో కొందరు జాతీయ రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధి రంగంలో కెరీర్‌ను కొనసాగించడానికి పెరుగుతున్న ప్రాధాన్యతను స్పష్టం చేస్తుంది.

పరిశ్రమ-విద్యాసంస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా ఎన్‌హెచ్ఏఐ... 2025 డిసెంబరు నెలలో సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం ఒక నెల వింటర్ ఇంటర్న్‌షిప్‌తో తన నిర్మాణాత్మక ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించింది. దాని తర్వాత ఆరు నెలల వ్యవధి గల ఇంటర్న్‌షిప్‌నూ ప్రవేశపెట్టింది. నెలకు రూ. 20,000 ఆకర్షణీయమైన స్టైపెండ్‌ను అందిస్తూ అనతికాలంలోనే ఈ కార్యక్రమం... ఇంజనీర్లు కావాలనుకునే వారికి దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన అనుభవపూర్వక అభ్యాస అవకాశాల్లో ఒకటిగా ఆవిర్భవించింది.

ఈ విజయం ఆధారంగా ఎన్‌హెచ్ఏఐ... 2026 వేసవి ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని గణనీయంగా విస్తరించింది. ఇందులో భాగంగా 125 ఎన్‌హెచ్ఏఐ క్షేత్ర కార్యాలయాల్లో, ఎన్‌హెచ్ఏఐ ప్రధాన కార్యాలయంలోని 51 క్రియాత్మక విభాగాల్లో వివిధ రంగాలకు చెందిన 423 మంది విద్యార్థులు ఇంటర్న్‌లుగా చేరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాంకేతిక సంస్థల ఉత్సాహభరితమైన భాగస్వామ్యం కనిపించింది. వీరిలో ఐఐటీల్లో చదివిన 59 మంది, ఎన్ఐటీ నుంచి 282 మంది విద్యార్థులు ఉన్నారు. భారత జాతీయ రహదారి అభివృద్ధి కార్యక్రమంతో ముడిపడి ఉన్న వృత్తిని చేపట్టడం పట్ల యువ ఇంజనీర్లలో పెరుగుతున్న విశ్వాసాన్ని ఇది ప్రతిబింబిస్తుంది.


ఈ కార్యక్రమాలకు అనుబంధంగా, సివిల్ ఇంజనీర్ల కోసం వృత్తిపరమైన వ్యవస్థను బలోపేతం చేయడానికి ఎన్‌హెచ్ఏఐ పలు సంస్కరణలనూ చేపట్టింది. ఇంజనీరింగ్ సేవలకు న్యాయమైన, వృత్తిపరమైన పరిహారాన్ని నిర్ధారించడానికి స్థిర-వ్యయ ప్రాజెక్టుల వివరణాత్మక నివేదికలను (డీపీఆర్‌లను) ప్రవేశపెట్టడం, సమర్థమైన పారితోషిక విధాన ప్రణాళికల ద్వారా అత్యుత్తమ ఇంజనీరింగ్ నిపుణులను డీపీఆర్, పర్యవేక్షణ కన్సల్టెంట్‌లుగా పనిచేసేందుకు ఆకర్షించే చర్యలూ ఇందులో ఉన్నాయి.

నిర్మాణాత్మక అభ్యసనం, ప్రతిభ ఆధారిత నియామకాల ద్వారా ఒక పటిష్ఠ వ్యవస్థను రూపొందించడం ద్వారా... దేశంలో పెరుగుతున్న అత్యంత నైపుణ్యం గల ఇంజనీరింగ్ ప్రతిభ డిమాండ్‌ను తీర్చడమే కాకుండా, ప్రపంచ స్థాయి జాతీయ రహదారి నెట్‌వర్క్ అభివృద్ధికీ దోహదపడేలా కొత్త తరం సివిల్ ఇంజనీర్లను తయారు చేయడాన్ని ఎన్‌హెచ్ఏఐ ప్రోత్సహిస్తోంది.

# చౌకధరల దుకాణాన్ని పరిశీలించిన సర్పంచ్

ఆదిలాబాద్, జులై 9: మండలంలోని బంబార గ్రామ పంచాయతీ పరిధిలోని చౌకధర దుకాణాన్ని గురువారం సర్పంచ్ బెండారే కృష్ణాజి సందర్శించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న బియ్యం నాణ్యతను పరిశీలించి, పంపిణీ ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న బియ్యాన్ని ప్రతి అర్హులైన లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు, డీలర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

# దేశవ్యాప్తంగా 200 ఐటీఐ క్లస్టర్లలో పీఎం-సేతు విస్తరణకు 4వ జాతీయ స్టీరింగ్ కమిటీ ఆమోదం

న్యూఢిల్లీ, జులై 9:'ఆధునీకరించిన ఐటీఐల ద్వారా ప్రధానమంత్రి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి పరివర్తన పథకం (పీఎం సేతు) 4వ జాతీయ స్టీరింగ్ కమిటీ (ఎన్ఎస్సీ)' సమావేశం ఈరోజు కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ (ఎంఎస్డీఏ) కార్యదర్శి శ్రీమతి దేబశ్రీ ముఖర్జీ అధ్యక్షతన జరిగింది. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో డీజీటీ డైరెక్టర్ జనరల్ శ్రీ దిలీప్ కుమార్, సంయుక్త కార్యదర్శి శ్రీమతి మానసి సహాయ్ ఠాకూర్‌లతో పాటు వివిధ రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ ప్రతినిధులు, బహుళ పక్ష అభివృద్ధి భాగస్వాములు, పారిశ్రామిక ప్రముఖులు, ఇతర కీలక వాటాదారులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో కమిటీ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. పీఎం సేతు పథకాన్ని ప్రయోగాత్మక దశ నుంచి దేశవ్యాప్త విస్తరణకు ఆమోదం తెలిపడం ఈ సమావేశంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న అంశం. ఇందులో భాగంగా గుర్తించిన మొత్తం 200 ఐటీఐ క్లస్టర్లలో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. పరిశ్రమల సన్నద్ధత, అమలు చేయగల సామర్థ్యాల ఆధారంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కమిటీ వీలు కల్పించింది. దీనితో పాటు పథకం అమలును మరింత సరళతరం చేయడం, పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచడం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రమేయాన్ని విస్తృతం చేయడం, పీఎం సేతు అమలుకు మద్దతుగా నిలిచే సంస్థాగత వ్యవస్థను బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలను కూడా కమిటీ ఆమోదించింది.

మొత్తం రూ. 1,237.58 కోట్ల వ్యయంతో కూడిన వ్యూహాత్మక పెట్టుబడి ప్రణాళికలకు కమిటీ ఆమోదం తెలిపింది. ఆయా రాష్ట్రాల స్టీరింగ్ కమిటీలు సిఫార్సు చేసిన ఈ ప్రణాళికల ద్వారా దేశవ్యాప్తంగా పలు ఐటీఐ క్లస్టర్లను పరిశ్రమల ఆధ్వర్యంలో ఆధునీకరించేందుకు మార్గం సుగమమైంది. ఇందులో భాగంగా ప్రముఖ పారిశ్రామిక సంస్థలైన జిందాల్ నవీన్ ఆవాసార్ లిమిటెడ్ ఒడిశాలోనూ, ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా గుజరాత్‌లోనూ కీలక భాగస్వాములుగా ముందుకు వచ్చాయి. వీటితో పాటు తెలంగాణలో అపోలో మెడ్‌స్కిల్స్, ఆమోదం పొందిన మరో రెండు ఐటీఐ క్లస్టర్లు ఈ ప్రతిష్టాత్మక ఆధునికీకరణ భాగస్వామ్యంలో చేరాయి.

ఒడిశాలో మంజూరైన ఐటీఐ క్లస్టర్‌కు ప్రభుత్వ ఐటీఐ 'బార్బిల్' ప్రధాన కేంద్రంగా వ్యవహరిస్తుంది.

దీనికి అనుబంధంగా ఆనంద్‌పూర్, కోయిరా, కరంజియా, బార్కోట్ ప్రభుత్వ ఐటీఐలు పనిచేస్తాయి. ఈ క్లస్టర్‌కు మెసర్స్ జిందాల్ నవీన్ ఆవాసార్ లిమిటెడ్ కీలక పారిశ్రామిక భాగస్వామిగా వ్యవహరిస్తుండగా... ఇక్కడ రూ. 240.21 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు.

గుజరాత్‌లో ప్రభుత్వ ఐటీఐ 'సూరత్' ప్రధాన కేంద్రంగా ఎంపికైంది. హజీరా, బార్డోలి, సచిన్, సూరత్ (మహిళా) ప్రభుత్వ ఐటీఐలు దీనికి అనుబంధంగా ఉంటాయి. ఈ క్లస్టర్ అభివృద్ధికి మెసర్స్ ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సంస్థ కీలక పారిశ్రామిక భాగస్వామిగా నిలిచింది. ఇక్కడ ప్రతిపాదించిన పెట్టుబడి వ్యయం రూ. 240.18 కోట్లు.

తెలంగాణలో మొత్తం మూడు ఐటీఐ క్లస్టర్లకు ఆమోదం లభించింది. అందులో మొదటిది ప్రభుత్వ ఐటీఐ 'ఓల్డ్ సిటీ' ప్రధాన కేంద్రగా ఉండగా... వరంగల్, నల్గొండ (బాలుర), వికారాబాద్ (బాలికల), పంజాగుట్ట ఐటీఐలు అనుబంధంగా ఉంటాయి. దీనికి మెసర్స్ అపోలో మెడ్-స్కిల్స్ లిమిటెడ్ భాగస్వామిగా వ్యవహరిస్తూ రూ. 241.01 కోట్ల పెట్టుబడి పెట్టనుంది.

రెండో క్లస్టర్: ప్రభుత్వ ఐటీఐ 'పటాన్‌చెరు' ప్రధాన కేంద్రంగా... షాద్‌నగర్, మర్పల్లి, నల్గొండ (కొత్తది), భువనగిరి ఐటీఐలు అనుబంధంగా ఉంటాయి. దీనికి మెసర్స్ శ్రీ సిద్ధార్థ ఇన్‌ఫ్రాటెక్, సర్వీసెస్ (ఐ) ప్రైవేటు లిమిటెడ్ (ఎస్ఎస్ఐఎస్‌పీఎల్) కీలక పారిశ్రామిక భాగస్వామిగా ఎంపికైంది. దీని పెట్టుబడి విలువ రూ. 275.24 కోట్లు.

మూడో క్లస్టర్: ప్రభుత్వ ఐటీఐ 'సంగారెడ్డి' ప్రధాన కేంద్రంగా ఉండగా... హథ్నూర, మెదక్, దుబ్బాక, ఎల్లారెడ్డి ఐటీఐలు దీని పరిధిలోకి వస్తాయి. మెసర్స్ న్యూలాండ్ ఫౌండేషన్ కీల పారిశ్రామిక భాగస్వామిగా వ్యవహరించనుంది. ఈ క్లస్టర్ కోసం రూ. 240.94 కోట్ల పెట్టుబడిని ప్రతిపాదించారు.

పీఎం సేతు పథకం గురించి...

భారత ప్రభుత్వ ప్రతిష్మాత్మకమైన పథకాల్లో పీఎం-సేతు ఒకటి. దేశంలోని ఐటీఐ వ్యవస్థను బలోపేతం చేసి, ఆధునీకరించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం.

మైన పరిశ్రమ భాగస్వామ్యాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, భవిష్యత్తు అవసరాలకు అనుగుణమైన పాఠ్యప్రణాళికలు, మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఇది దోహదపడుతుంది.

## ఆలేరులో రైతు సేవా కేంద్రం ప్రారంభం

నల్గొండ, జులై 9: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపల్ పరిధిలో రైతు సేవా కేంద్రాన్ని బహదూర్‌పేట బిల్ కలెక్టర్ దొంతుల ఎల్లయ్య గురువారం ప్రారంభించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పంటల సంరక్షణ మందులు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటాయని నిర్వాహకుడు దొంతుల రాజు తెలిపారు.

రైతులు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులను ఒకేచోట పొందేలా సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

## ట్రినిటీ హైస్కూల్‌లో విద్యార్థి నాయకుల ఎన్నికలు

నల్గొండ, జులై 9: చౌటుప్పల్ పట్టణంలోని ట్రినిటీ హైస్కూల్‌లో హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ఎన్నికలు గురువారం ఉత్సాహభరితంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. సాధారణ ఎన్నికల తరహాలో విద్యార్థులందరూ క్రమశిక్షణతో తమ ఓటు హక్కును వినియోగించుకుని విద్యార్థి నాయకులను ఎన్నుకున్నారు.

ఎన్నికల ఫలితాల్లో మెయిన్ క్యాంపస్ హెడ్ బాయ్‌గా బి. పవన్ కుమార్, హెడ్ గర్ల్‌గా సిహెచ్. మనస్విని ఎన్నికయ్యారు. అలాగే ఐఐటీ క్యాంపస్ హెడ్ బాయ్‌గా ఎన్. సాయి నిఖిల్, హెడ్ గర్ల్‌గా జి. హర్షిత విజయం సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కెవీబీ కృష్ణారావు, ప్రిన్సిపాల్ కమ్ డైరెక్టర్ డాక్టర్ ఉజ్జిని మంజుల నూతన విద్యార్థి నాయకులతో ప్రమాణ స్వీకారం చేయించి, వారికి బ్యాడ్జ్‌లు అలంకరించి అభినందించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు.

# పెద్దవాగు ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులను ఆదుకోవాలి..



ఖమ్మం, జులై 9: పెద్దవాగు ప్రాజెక్ట్ గండిపడడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయకట్టు రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. గురువారం దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలోని మంత్రి తుమ్మల నివాసంలో ఆయన ఈ విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పెద్దవాగు ప్రాజెక్ట్ దెబ్బతినడంతో ఆయకట్టు రైతులు వరుసగా మూడు పంట సీజన్లుగా తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చర్చించి, ప్రాజెక్ట్ మరమ్మత్తు పనులను అత్యవసరంగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పెద్దవాగు ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులతో కలిసి త్వరలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలను, ప్రాజెక్ట్ మరమ్మత్తుల అవసరాన్ని వివరించనున్నట్లు తాటి వెంకటేశ్వర్లు తెలిపారు.

# బీఆర్ఎస్‌ది బూటకపు చేరికల డ్రామా: కాంగ్రెస్

**-సొంత కార్యకర్తలకే కండువాలు కప్పి కాంగ్రెస్ నుంచి చేరారంటూ ప్రచారం..**

**-నిజంగా కాంగ్రెస్ నేతలైతే ఒక్క పదవి అయినా చూపించాలని సవాల్..**



ఖమ్మం, జులై 9: కన్నాయిగూడెం మండలంలో లక్ష్మీపురం గ్రామంలో బీఆర్ఎస్ నిర్వహించిన చేరికల కార్యక్రమం బూటకమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాడి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఎండీ అప్సర్ పాషా విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలకే గులాబీ కండువాలు కప్పి కాంగ్రెస్ నుంచి భారీ చేరికలు జరిగాయని ప్రచారం చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని అన్నారు.

మంగళవారం బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ఒక్కరికీ కూడా కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వారు నిజంగా కాంగ్రెస్ నాయకులైతే పార్టీ తరఫున నిర్వహించిన కనీసం ఒక్క పదవి అయినా చూపించాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్‌కు కన్నాయిగూడెం మండలంలో ప్రజా మద్దతు లేకపోవడంతో ఇలాంటి అసత్య ప్రచారాలకు పాల్పడుతోందని ఆరోపించారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో లక్ష్మీపురం గ్రామానికి చెప్పుకోదగ్గ అభివృద్ధి జరగలేదని, రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతులు కూడా కల్పించలేదని విమర్శించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రి సీతక్క ఆధ్వర్యంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గ్రామపంచాయతీ భవనాలు, ప్రజాదర్బార్లు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త పింఛన్లు, సన్నబియ్యం వంటి పథకాలు ప్రజలకు అందుతున్నాయని తెలిపారు.

ప్రజా ప్రభుత్వ అభివృద్ధిని చూసి ఓర్వలేకే కాంగ్రెస్‌పై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించిన కాంగ్రెస్ నాయకులు, ఇకనైనా బీఆర్ఎస్ అసత్య ప్రచారాలకు స్వస్తి పలకాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**-డోంగ్లీ-1, మారేపల్లి కేంద్రాల్లో ఖాళీలు**

నిజామాబాద్, జులై 9: ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా డోంగ్లీ మండలంలోని డోంగ్లీ-1, మారేపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్, హెల్పర్ పోస్టులకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.

అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ పోస్టుల భర్తీకి సంబంధించి నిబంధనల ప్రకారం అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తులను సమర్పించాలని అధికారులు సూచించారు. దరఖాస్తు ఫారాలు, అర్హతలు, ఇతర నిబంధనలకు సంబంధించిన పూర్తి వివరాలు సంబంధిత సీడీపీఓ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. విద్యార్హత, స్థానికత, వయోపరిమితి తదితర నిబంధనల మేరకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆసక్తి గల అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# చౌటుప్పల్‌లో ఘనంగా ఇందిరమ్మ శక్తి చీరల పంపిణీ

**-వార్డు కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్**

**-ఎస్ఐఆర్ ఫామ్‌లపై మహిళలకు అవగాహన సదస్సు**



నల్గొండ, జులై 9:చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని 14వ వార్డు గౌడ సంఘం ఆవరణలో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. 14వ వార్డు కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై కాలనీకి చెందిన మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే ఈ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

ఎస్ఐఆర్ ఫామ్‌లపై అవగాహన

చీరల పంపిణీ అనంతరం మున్సిపల్ సిబ్బంది, ఆశా వర్కర్ల సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు 'ఎస్ఐఆర్ ఫామ్'ల ప్రాధాన్యతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ జ్యోతి రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు, ఆరోగ్య సర్వేలకు సంబంధించిన వివరాల నమోదులో ఎస్ఐఆర్ ఫామ్‌లు ఎంతో కీలకమైనవని, మహిళలందరూ వీటిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్ గౌడ్, వర్కాల రవి గౌడ్, కామిశెట్టి శేఖర్ గుప్తా, దొడ్డి గణేష్, ఉష్కాగుల నాగరాజు గౌడ్, వరగంటి భాను గౌడ్, చెరుకు రాజు గౌడ్, మున్సిపల్ సిబ్బంది, ఆశా వర్కర్లు, కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొచ్చిలో బ్రిక్స్ దేశాల మహిళా మంత్రివర్గ సమావేశానికి ఆతిథ్యం ఇవ్వనున్న భారత్

న్యూఢిల్లీ, జులై 9:భారత్ అధ్యక్షతన బ్రిక్స్ సదస్సు-2026 నిర్వహణ నేపథ్యంలో జులై 8 నుంచి 9, 2026 వరకు కేరళలోని కొచ్చిలో బ్రిక్స్ దేశాల మహిళా మంత్రివర్గ సమావేశం జరుగుతుంది. పరస్పర సహకారాన్ని బలోపేతం చేయటం, మహిళా సాధికారతను పెంపొందించటం.. సమ్మిళితమైన, పటిష్ఠమైన, స్థిరమైన అభివృద్ధి పట్ల ఉమ్మడి నిబద్ధతను స్పష్టం చేసేందుకు బ్రిక్స్ సభ్య దేశాల మంత్రులు, ప్రతినిధుల బృందాలు ఒకచోట సమావేశం అవుతారు.

భారత్ అధ్యక్షతన బ్రిక్స్ సదస్సు నాలుగు ప్రధాన అంశాలపై ఆధారపడి ఉంది. దృఢత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత. ప్రతి రంగంలోనూ మహిళల సాధికారతను పెంపొందించే విధంగా బ్రిక్స్ మహిళా విభాగాన్ని రూపొందించారు.

జులై 6 నుంచి 7, 2026వ తేదీ వరకు బ్రిక్స్ ఉమెన్ వర్కింగ్ గ్రూప్ సమావేశం అనంతరం ఈ మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. సీనియర్ అధికారులు ఈ వర్కింగ్ గ్రూప్ సమావేశంలో బ్రిక్స్ ఉమెన్ ట్రాక్ పరిధిలోని ప్రాధాన్యతా రంగాలపై విస్తృత చర్చలు జరిపారు. ఉమెన్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేసిన బలమైన పునాదుల ఆధారంగా బ్రిక్స్ సభ్య దేశాల మధ్య సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లటానికి ప్రతిపాదిత ఫలితాలపై మంత్రులు చర్చించి, వ్యూహాత్మక దిశా నిర్దేశం చేయనున్నారు.

ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ.. మానవత్వమే పరమావధిగా సాగే విధానాన్ని ప్రతిబింబించేలా భారత్ అధ్యక్షతన బ్రిక్స్ సదస్సు "పటిష్టత, ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" ఇతివృత్తంతో ఈ మంత్రివర్గ సమావేశం జరగనుంది. మహిళల నాయకత్వాన్ని ప్రోత్సహించటం, ఆర్థిక అవకాశాలను విస్తరించటం, డిజిటల్ ఆర్థిక సమగ్రతను బలోపేతం చేయటం, వ్యవస్థాపకతను పెంపొందించటం, వాతావరణ చర్యలు, ఆహార భద్రత, పోషకాహార రంగాల్లో మహిళల సహకారాన్ని గుర్తించటం వంటి అంశాలపై ఉన్నత స్థాయి చర్చలకు ఈ సమావేశం వేదికగా నిలుస్తుంది. లింగ సమానత్వం దిశగా ఆచరణాత్మక సహకారాన్ని పెంపొందించేందుకు పురోగతిని వేగవంతం చేయటానికి బ్రిక్స్ సభ్య దేశాల ఉమ్మడి ఆకాంక్షను ఈ చర్చలు ప్రతిబింబిస్తాయి.

గ్రామీణాభివృద్ధి, స్టెమ్, పోషకాహారం, విద్య, మరిన్ని విభిన్న రంగాల్లో మహిళల నేతృత్వంలోని అభివృద్ధిలో భారత్ సాధించిన విజయాలను తెలియజేసే ప్రదర్శనలు ఈ మంత్రిత్వ స్థాయి సమావేశానికి అదనపు ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఒక ప్లీనరీ సెషన్, ప్రముఖ నిపుణులు, విధాన నిర్ణేతలు, నిపుణులతో కూడిన నేపథ్య ప్యానెల్ చర్చలుంటాయి. ఇవి అనుభవాలను పంచుకునేందుకు, వినూత్న విధానాలను మార్పిడి చేసుకునేందుకు, మహిళా సాధికారతకు భాగస్వామ్యాలను పెంపొందించుకునేందుకు ఒక మంచి అవకాశాన్ని అందిస్తాయి.

## మొదటి తుర్కకాశ జెండా ఆవిష్కరణ



నిజామాబాద్, జులై 9:భీమ్‌గల్ మండలంలోని జాగిర్యాల గ్రామం బుధవారం తెలంగాణ రాష్ట్ర తుర్కకాశ సంక్షేమ సంఘం జెండాను ముఖ్యఅతిథిగా షేక్ బడేసాబ్, హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ షరీఫ్ మాట్లాడుతూ.. తుర్కకాశ సంక్షేమ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఐక్యమతం మహా బలమని తెలిపారు.

ప్రతి ఏటా తెలంగాణ ప్రభుత్వం తుర్కకాశి సంక్షేమానికి 100 కోట్లు బడ్జెట్ లక్ష్యంగా కృషి చేయాలని ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ నాయకులు ఉపాధ్యక్షుడు అబ్దుల్ రహీం, షాదుల్లా, లీగల్ అడ్వకేట్ యమీన్ భాష, ప్రచార కార్యదర్శి సయ్యద్ ముఖేమ్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు నూరు మొహమ్మద్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సఫాయి భాష,నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ మౌలానా, వర్కింగ్ ప్రెసిడెంట్ కలీం, కోశాధికారి షేక్ సమీర్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ కరీం, జిల్లా సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ షేక్ రహీం భాష, సయ్యద్ జాన్, భీంగల్ మండల అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా, ధర్పల్లి మండల అధ్యక్షుడు షేక్ ఖాజీ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగస్వాములు కావాలి..

నిజామాబాద్, జులై 9: ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన ఓటరు పాల్గొని ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని బీజేపీ భీమ్‌గల్ మండల అధ్యక్షుడు అరె రవీందర్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని మెండోరా గ్రామంలో ఆయన, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు అరె లావణ్య దంపతులు తమ ఓటరు గణన పత్రాలను పూర్తి చేసి సంబంధిత బూత్ లెవల్ అధికారి (బీఎల్వో) దీప్సన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అరె రవీందర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితా సక్రమంగా రూపొందడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎంతో కీలకమని అన్నారు. ఎన్నికల సంఘం సూచించిన విధంగా ప్రతి అర్హత కలిగిన ఓటరు గణన పత్రాలను పూర్తిచేసి అవసరమైన ధ్రువపత్రాలతో కలిసి సంబంధిత బీఎల్వోలకు సమర్పించాలని కోరారు.

అపోహలు, అసత్య ప్రచారాలను నమ్మకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించాలని సూచించారు.

# 2026 కామన్వెల్త్ క్రీడల్లో పర్యావరణ హిత జనపనార దుస్తుల్లో మెరవనున్న భారత బృందం

న్యూఢిల్లీ, జులై 9:స్కాట్లాండ్‌లోని గ్లాస్గో నగరంలో జులై 23 నుంచి ఆగస్టు 2, 2026 వరకు జరగనున్న కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొనే భారతీయ క్రీడాకారులు, బృంద సభ్యులు జనపనారతో రూపొందించిన దుస్తుల్ని ధరించనున్నారు. పర్యావరణ హిత వస్త్రాలను ప్రోత్సహించడంతోపాటు, దేశీయ ఆవిష్కరణలను ప్రపంచం ముందు ఉంచాలన్న ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ పరిధిలోని జాతీయ జనపనార సంస్థ (ఎన్‌జేబీ) జనపనార-విస్కోస్ మిశ్రమ దుస్తులను రూపొందించింది.

మేక్ ఇన్ ఇండియా ఉత్పత్తులను ప్రోత్సహించాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా ఈ నిర్ణయానికి శ్రీకారం చుట్టారు. కేంద్ర జౌళి శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ నాయకత్వంలో జాతీయ జనపనార సంస్థ ద్వారా జనపనారతో రకరకాల వినూత్న ఉత్పత్తుల తయారీని మంత్రిత్వ శాఖ చురుగ్గా ముందుకు తీసుకెళుతున్నది. వంద శాతం పర్యావరణ హితమైన ఈ జనపనార-విస్కోస్ మిశ్రమ వస్త్రం.. రాబోయే రోజుల్లో పర్యావరణ హిత జౌళి రంగంలో ఒక వినూత్న పరిష్కారంగా మారే అపారమైన అవకాశం కలిగి ఉందని ఈ నిర్ణయం నిరూపిస్తోంది.

కామన్వెల్త్ క్రీడలు 2026కు సంబంధించి భారత జట్టు అధికారిక కిట్ ఆవిష్కరణ, వీడ్కోలు వేడుక ఈరోజు (జులై 7, 2026) న్యూఢిల్లీలో జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ, కేంద్ర జౌళి శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్, కేంద్ర క్రీడల శాఖ సహాయ మంత్రి శ్రీమతి రక్షా ఖడ్సే పాల్గొన్నారు. వీరితో పాటు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు శ్రీమతి పీటీ ఉష, అసోసియేషన్ కార్యనిర్వాహక మండలి సభ్యులు హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

ఒక అంతర్జాతీయ బహుళ క్రీడా కార్యక్రమంలో జనపనార ఆధారిత దుస్తులను ప్రదర్శించడం ఇదే మొదటిసారి. ఈ చర్య భారతీయ జనపనార పరిశ్రమకు ప్రపంచవ్యాప్త గుర్తింపును తీసుకురావడంతోపాటు, దేశీయ తయారీదారుల నైపుణ్యాన్ని, జనపనార రైతుల శ్రమను అంతర్జాతీయ వేదికపై చాటిచెబుతుందని భావిస్తున్నారు.

కోల్‌కతాలోని గ్లోస్టర్ జూట్ మిల్స్ సహకారంతో జాతీయ జనపనార బోర్డు జనపనార-విస్కోస్ మిశ్రమ వస్త్రాన్ని అభివృద్ధి చేసింది. ఈ వినూత్న వస్త్ర ఉత్పత్తులను ఏప్రిల్ 1, 2026న పాట్నాలో జరిగిన జాతీయ జనపనార బోర్డు వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో తొలిసారిగా ప్రదర్శించారు. అక్కడ భారత ఒలింపిక్ సంఘం ప్రతినిధులు ఈ సరికొత్త కార్యక్రమాన్ని ప్రశంసించారు.

పట్నా ప్రదర్శన విజయవంతం కావడంతో భారత జట్టు కోసం ఈ దుస్తులను వినియోగించేలా జాతీయ జనపనార బోర్డు, భారత ఒలింపిక్ సంఘంతో కలిసి పనిచేసింది. దీని కోసం ప్రత్యేకంగా రూపొందించిన జనపనార-విస్కోస్ మిశ్రమ వస్త్రాన్ని ఉపయోగించి న్యూఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (ఎన్ఐఎఫ్‌టీ) ఈ దుస్తులను అద్భుతంగా రూపొందించింది. ఈ కామన్వెల్త్ క్రీడలు 2026 పోటీల్లో ప్రపంచవ్యాప్తంగా 72 దేశాల క్రీడాకారులు పాల్గొననున్నారు.

# ఏపీలో కియా విస్తరణకు ఆహ్వానం

## -కియా ఉన్నతాధికారులతో భేటీ..




అమరావతి, జులై 9: ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న రాష్ట్ర విద్య, సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ వరుసగా కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఐదో రోజు పర్యటనలో భాగంగా సియోల్‌లో కియా కార్పొరేషన్ గ్లోబల్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ టే హన్ లీతో పాటు సంస్థ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో కియా కార్యకలాపాలను మరింత విస్తరించాలని లోకేశ్ కోరారు. ప్రత్యేక ప్రయోజనాల కోసం రూపొందించే పర్పస్-బిల్ట్ వెహికల్స్ తో పాటు సమగ్ర ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాల తయారీ కేంద్రాన్ని రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అలాగే ప్రపంచ మార్కెట్లకు ఎగుమతుల కోసం విశాఖపట్నం పోర్టు సమీపంలో సీకేడీ అసెంబ్లీ, ఎగుమతి కేంద్రం, ఈవీ పవర్‌ట్రెయిన్ టెస్టింగ్ సెంటర్, వెహికల్ హోమో లొగేషన్ కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతపురంలోని కియా తయారీ యూనిట్‌ను మరింత విస్తరించాలని కూడా విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని కియా ప్రతినిధులు తెలిపారు.

అనంతరం దక్షిణ కొరియా విదేశాంగ ఉపమంత్రి సిసిలియా చుంగ్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. పెట్టుబడిదారులకు ఆంధ్రప్రదేశ్ అత్యంత విశ్వసనీయ గమ్యస్థానమని పేర్కొంటూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 3ఎస్ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) విధానం పరిశ్రమలకు పూర్తి భరోసా కల్పిస్తుందని వివరించారు.

కొరియా-ఆంధ్రప్రదేశ్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్ ఏర్పాటు, రాష్ట్రంలో కొరియన్ కల్చరల్ సెంటర్ స్థాపన, సంయుక్త శిక్షణా అకాడమీలు ఏర్పాటు వంటి ప్రతిపాదనలను లోకేశ్ ముందుంచారు. గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్, పర్యాటక రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కొరియా సంస్థలను ఆహ్వానించారు.

విశాఖపట్నం-బుసాన్ లేదా ఇంచియాన్ మధ్య ప్రత్యక్ష విమాన సర్వీసులు ప్రారంభించడంతో పాటు, ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాల్లో కొరియన్ భాషా కేంద్రాలు ఏర్పాటు చేయాలని కూడా కోరారు. రాష్ట్రంలోని ఆధునిక పోర్టుల సామర్థ్యంతో ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంటూ, కొరియా-ఆంధ్రప్రదేశ్ ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు.

# ఆపదలో ఉన్న వారికి అండగా సీఎం సహాయ నిధి

## -రూ.11.52 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం, జులై 9: శ్రీకాకుళం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.11.52 లక్షల విలువైన 10 చెక్కులను లబ్ధిదారులకు గురువారం అందజేశారు.

అనారోగ్య సమస్యలు, ప్రమాదాలు, అత్యవసర వైద్య ఖర్చుల కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పది కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం అందింది. ప్రభుత్వం అందించిన సహాయం తమకు ఎంతో ఊరటనిచ్చిందని లబ్ధిదారులు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి వంటి పథకాలు ఆపదలో ఉన్న వారికి ఎంతో ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేసి, నిజమైన అర్హులకు సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యకర్తలు ప్రభుత్వ పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని కోరారు.

ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ, తమ కష్టకాలంలో అండగా నిలిచిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా సాయం అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# సామాన్య భక్తులకే తొలి ప్రాధాన్యం..

## -ఇంద్రకీలాద్రి సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కృతనిశ్చయం

## -దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్



విజయవాడ జులై 9: విజయవాడ కనకదుర్గమ్మ క్షేత్రమైన ఇంద్రకీలాద్రి సమగ్ర అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కృతనిశ్చయంతో ఉందని, సామాన్య భక్తులకు మెరుగైన, సౌకర్యవంతమైన సేవలు అందించడమే తమ మొదటి ప్రాధాన్యత అని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ స్పష్టం చేశారు. ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న పోటు (ప్రసాదశాల) అన్నప్రసాద భవన నిర్మాణ పనులను గురువారం కమిషనర్ రామచంద్ర మోహన్ పరిశీలించారు. జులై 15 లోపు ఇంద్రకీలాద్రి 'మాస్టర్ ప్లాన్' డ్రాఫ్టు నమూనా సిద్ధం కావాలి. శ్రావణ మాసంలోగా నూతన లడ్డూ పోటు, అన్నదాన భక్తుల కోసం వినియోగం లోనికి తేవాలి.

భక్తులకు వీలయినంత స్థలాన్ని వినియోగం లోనికి తీసికొని రావటం కోసమే సదరు నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని,అంతేకాని షాపులను ఏర్పాటు చేయడం కోసం కాదు అని దేవస్థానం సిబ్బందికి గట్టిగా కమిషనర్ మందలించారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ శ్రీ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఉన్నతాధికారులతో కలిసి ఆయన పనుల ప్రగతిని సమీక్షించారు. ??ఈ సందర్భంగా కమిషనర్ రామచంద్ర మోహన్ మాట్లాడుతూ రాబోయే శ్రావణ మాసం నాటికి నూతన లడ్డూ పోటు, అన్నదాన భవనాలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని దేవస్థానం అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అలాగే, ఇంద్రకీలాద్రి భవిష్యత్తు అవసరాలను దృష్టి లో ఉంచుకుని రూపొందిస్తున్న 'మాస్టర్ ప్లాన్' తుది నమూనాను జులై 15 లోపు సిద్ధం చేసి తమకు సమర్పించాలని ఆదేశించారు.

క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా కమిషనర్ కే రామచంద్ర మోహన్ మొదట నూతన లడ్డూ పోటు నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు ఆశించిన స్థాయిలో వేగంగా జరగకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "నేను స్వయంగా ఇన్నిసార్లు పర్యవేక్షిస్తూ, దిశానిర్దేశం చేస్తున్నా ఇంకా పనులు కొనసాగుతూనే ఉండటం ఏమిటి" అని ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. రాబోయే దసరా నవరాత్రి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని, యుద్ధప్రాతిపదికన రేయింబవళ్లు (24/7) షిఫ్టుల వారీగా పనులు నిర్వహించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ భవనానికి వేసే రంగులు ఆహ్లాదకరంగా ఉండాలని పేర్కొంటూ రంగులు ఎంపిక చేసారు, లడ్డు పోటు ఫ్లోర్ నిర్మాణం పరిశీలన చేశారు.

అనంతరం నూతన అన్నదాన భవనాన్ని పరిశీలించిన కమిషనర్ శ్రీ రామచంద్ర మోహన్, అక్కడ జరుగుతున్న పనులలో తగినంత వేగవంతంగా జరగటం లేదని అభిప్రాయ పడ్డారు. నిర్మాణ పనులు చేసేటప్పుడు వృధా వ్యయాన్ని అరికట్టాలని కమిషనర్ కే రామచంద్ర మోహన్ సూచించారు. ఇక్కడ జరిగే ప్రతి పని భక్తులకు 100% ఉపయోగపడేలా, అత్యంత నాణ్యతతో ఉండాలని, పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని,. ఎట్టి పరిస్థితుల్లోనూ శ్రావణ మాసంలో ఈ రెండు భవనాలు ప్రారంభమై భక్తుల సేవకు వినియోగపడాలని అన్నారు. రాబోయే దసరా శరన్నవరాత్రి ఉత్సవాల నాటికి నూతన పోటులోనే ప్రసాదం తయారీ, నూతన భవనంలోనే అన్నప్రసాద వితరణ జరగాలని,. ఇది భక్తుల సౌకర్యాలకు సంబంధించిన విషయం, ఇందులో ఎలాంటి అలసత్వాన్ని సహించం" అని కమిషనర్ చెప్పారు.

భక్తుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు రూపుదిద్దుకుంటున్న ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్ క్రింది భాగంలో కూల్ డ్రింక్ షాపులు, క్లోక్ రూమ్ మరియు ఇతర వాణిజ్య ఏర్పాట్లు చేయడంపై కమిషనర్ తీవ్రంగా మండిపడ్డారు. దీనిపై దేవాలయ అధికారులను అక్కడికక్కడే వివరణ కోరారు. భక్తుల సౌకర్యార్థం నిర్మించిన స్థలాల్లో ఇలాంటి వ్యాపార ఏర్పాట్లు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వాటిని తక్షణమే తొలగించాలని ఆదేశించారు. ఇంద్రకీలాద్రిపై ఉన్న ప్రతి అంగుళం స్థలం కేవలం భక్తుల అవసరాలకు, వారి సౌకర్యాలకే ఉపయోగపడాలని అధికారులకు గట్టిగా హితవు పలికారు. ఈ విస్తృతస్థాయి పర్యటనలో దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మన్ శ్రీ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), డిప్యూటీ ఈవో శ్రీ కిషోర్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీమతి రమ, అసిస్టెంట్ కమిషనర్ శ్రీ రంగారావు, ఆలయ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటర్ల సవరణ దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్



హైదరాబాద్, జులై 9: ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం వేగంగా కొనసాగుతోందని మాజీ కార్పొరేటర్ ఎలగం లీలావతి సత్యనారాయణ తెలిపారు.

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి సూచనల మేరకు గురువారం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి బీఎల్‌వోల ద్వారా ఓటరు గణన దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు.

దరఖాస్తులను స్వీకరించిన అనంతరం వాటిలో ఏవైనా లోపాలు ఉంటే సరిదిద్దుతున్నామని, ప్రతి ఫారాన్ని బీఎల్‌వోలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని తెలిపారు. పూర్తిగా నింపిన దరఖాస్తులను మరోసారి తనిఖీ చేసిన తర్వాతే స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ నాయకులు పాల్గొని ఓటర్లకు అవసరమైన సమాచారం అందిస్తూ సహకరించారు

# బీఎల్‌వోలకు సహకరించి ఓటు హక్కును పరిరక్షించుకోవాలి..

నల్గొండ, జులై 9:ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రజలందరూ బీఎల్‌వోలకు సహకరించాలని, తమ విలువైన ఓటు హక్కును కోల్పోకుండా అవసరమైన వివరాలను సకాలంలో అందించాలని మందమర్రి తహసీల్దార్ సతీష్ కోరారు.

గురువారం ఆయన మాట్లాడుతూ.. క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎస్ఐఆర్ ఫారాలను అందజేస్తూ సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఈ ప్రక్రియకు వారం రోజుల గడువు కల్పించిందని, అనంతరం బీఎల్‌వోలు తిరిగి ఓటర్ల వద్దకు వెళ్లి పూర్తిచేసిన ఫారాలు, అవసరమైన పత్రాలను సేకరిస్తారని చెప్పారు. ఫారం నింపడంలో ఇబ్బందులు ఉంటే బీఎల్‌వోలు, సూపర్వైజర్లు స్వయంగా సహాయం అందిస్తారని వివరించారు.

కొన్ని ప్రాంతాల్లో ఓటర్లు ఫారాలు అందలేదని ఫిర్యాదు చేసిన నేపథ్యంలో, ఓటరు ఇంట్లో లేనిపక్షంలో కనీసం మూడుసార్లు వెళ్లి ఫారం అందజేసేందుకు ప్రయత్నించాలని, సాధ్యం కాకపోతే ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని బీఎల్‌వోలకు సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధికారి ప్రతిభ, మాజీ కౌన్సిలర్ కొక్కుల సతీష్, బీఎల్‌వో సంతోష్ రాణి, స్థానికులు పాల్గొన్నారు.

# నిజాంపేట మండలంలో రెండు అంగన్‌వాడీ టీచర్ పోస్టులు



మెదక్, జులై 9: ఐసీడీఎస్ రామాయంపేట-నిజాంపేట ప్రాజెక్టు పరిధిలోని చల్మెడ, వెంకటాపూర్ (కె) గ్రామాలకు అంగన్‌వాడీ టీచర్ (ఏడబ్ల్యూటీ), గిరిజన అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఐసీడీఎస్ సూపర్వైజర్ లక్ష్మి తెలిపారు. నిజాంపేట మండలంలో మొత్తం రెండు అంగన్‌వాడీ టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

పోస్టులకు సంబంధించిన పూర్తి వివరాలను సంబంధిత గ్రామపంచాయతీ కార్యాలయాలకు పంపనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థుల నుంచి జూలై 10 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని వెల్లడించారు.

విద్యార్హతలు, వయోపరిమితి, ఎంపిక విధానం తదితర వివరాలు అధికారిక నోటిఫికేషన్‌లో అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు నిర్ణీత గడువులోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# నిజామాబాద్‌లో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య.. కేసు నమోదు చేసిన పోలీసులు

## దుర్వాసన రావడంతో డయల్ 100 సమాచారం ఇచ్చిన స్థానికులు

నిజామాబాద్, జులై 9:నిజామాబాద్ నగరంలోని వినాయక నగర్ ప్రాంతంలో ఓ వ్యక్తి తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం వెలుగు చూసింది. స్థానిక పాత హౌసింగ్ బోర్డ్ కాలనీలో నివాసముండే ఎం జగదీష్ (60) అనే వ్యక్తి గత రెండు రోజులుగా ఇంటి తలుపులు తెరవకపోవడంతో ఇంట్లోంచి దుర్వాసన వస్తుందని స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని చుట్టుపక్కల వారు డయల్ 100కు ఫోన్ చేసి సమాచామందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

పాత హౌసింగ్ బోర్డ్ కాలనీలోని, బ్లాక్ నెంబర్ 13/2లో పై అంతస్తులు ఉండే జగదీష్ ఇంటి తలుపులను లోబడి నుండి పెట్టుకొని ఉండడంతో పోలీసులు స్థానికుల సహాయంతో డోర్లను తెరిచి చూశారు. ఆ ఇంట్లో మొదటి గదిలో ఆయన ఫ్యాన్ కు ఉరివేసుకొని వేలాడుతూ ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడి భార్య గత కొంత గీతం చనిపోవడం, అప్పటినుండి ఆయన ఇంట్లో ఒంటరిగానే ఉంటున్నట్లు చుట్టుపక్కల వారు తెలిపారు. ఆయన ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని మృతుడి తమ్ముడైన మహేందర్‌కు పోలీసులు ఫోన్ చేసి సమాచారమందించారు. అయితే ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ఆయన ఆత్మహత్యకు పాల్పడాల్సిన అవసరం ఏమిటన్న విషయం తెలియ రాలేదు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు నాలుగో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# ఆత్మవిశ్వాసం, స్వయం సాధికారత ముఖ్యం

## -బేటీ బచావో-బేటీ పడావో అవగాహనలో జిల్లా సంక్షేమ అధికారి లలితా కుమారి

సంగారెడ్డి, జులై 9: (నేటినిజం ప్రతినిధి):జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సహకారంతో బేటీ బచావో?బేటీ పడావో (బీబీబీపీ) కార్యక్రమంలో భాగంగా రఘురానంగం మండలంలోని మహాత్మా జ్యోతిబా ఫూలే రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థినుల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి కె.లలిత కుమారి మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టం?2006, పోష్, పోక్సో చట్టం, మహిళలు?చిన్నారుల రక్షణకు సంబంధించిన హెల్ప్‌లైన్ నంబర్లు, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆడపిల్లల ప్రాముఖ్యత, విద్య అవసరం, మహిళల భద్రత, సాధికారత వంటి అంశాలపై విద్యార్థినులకు సమగ్ర అవగాహన కల్పించారు.

మహిళలు, బాలికల రక్షణతో పాటు వారి విద్య, ఆత్మవిశ్వాసం, స్వయం సాధికారత ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా బాల్య వివాహాలు, వేధింపులు, వివక్ష వంటి సమస్యలను అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సుశీల, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త, మెడికల్ ఆఫీసర్, సఖి సెంటర్ ప్రతినిధులు, పాఠశాల ప్రిన్సిపాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పోలీసు శాఖ సిబ్బంది, జెండర్ స్పెషలిస్ట్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# పొన్నెకల్లు వద్ద అదుపుతప్పి కిందపడ్డ బైక్.. యువకుడు మృతి



ఖమ్మం, జులై 9: రోడ్డు ప్రమాదంలో ఓ ద్వి చక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన గురువారం ఖమ్మం రూరల్ మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తల్లంపాడు నుండి ఖమ్మం వైపు ఓ ద్విచక్ర వాహనంపై ఇద్దరు యువకులు వస్తున్నారు. పొన్నెకల్లు గ్రామ పరిసర ప్రాంతాల్లోకి వచ్చే సమయంలో బైకు ఒక్కసారిగా అదుపుతప్పి పడిపోవడంతో అక్కడికక్కడే ఓ యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి.

సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని మెరుగైన వైద్య కోసం ఖమ్మం వైద్యశాలకు తరలించారు. మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చురికి తరలించారు.

# కువైట్ ఎడారిలో తెలంగాణ యువకుడి పూడ్చివేత

కామారెడ్డి, జులై 9: ఉపాధి కోసం కువైట్‌కు వెళ్లిన తెలంగాణ యువకుడు శవమై తేలాడు. గుట్టుచప్పుడు కాకుండా అతడ్ని ఎడారిలో పాతిపెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. డిచ్‌పల్లి మండలం కొరట్‌పల్లి తండాకు చెందిన గుగులోత్ కైలాశ్ (30) బీటెక్ పూర్తి చేసి, ఐదేళ్ల క్రితం కువైట్‌కు వెళ్లాడు. అక్కడి సాల్మి ఎడారి ప్రాంతంలో జరుగుతున్న హైవే నిర్మాణ పనుల్లో పాలు పంచుకుంటున్నాడు. అయితే, మార్చి 19న తన తల్లిదండ్రులకు చివరిసారిగా ఫోన్ చేసిన అతడు ఆచూకీ లేకుండా పోయాడు.

ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు కువైట్‌లో తమకు తెలిసిన వారితో అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేయించారు. కేసు నమోదు చేసి, లోతుగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఎడారి వైపు వెళ్లేటప్పుడు కారులో ఇద్దరు ఉన్నారని, వచ్చేటప్పుడు ఒక్కరు మాత్రమే తిరిగి వచ్చారని గుర్తించారు. ఈ క్రమంలో సీసీ ఫుటేజీలో నమోదైన ఆధారాలతో అనుమానితుడ్ని అదుపులోకి తీసుకుని విచారించగా, నిజం బయటికి వచ్చింది. క్రేన్ ప్రమాదంలో కైలాశ్ మృతి చెందాడని, ఇది తమ మీదకు వస్తుందన్న భయంతో తన తండ్రితో కలిసి అక్కడే ఇసుకలో పాతి పెట్టామని అంగీకరించాడు. దీంతో నిందితుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అతడి తండ్రి అప్పటికే కువైట్ విడిచి ఇండియాకు చేరుకున్నాడని గుర్తించారు. వీరిది డిచ్‌పల్లి మండలం సాంపల్లి తండా పరిధిలోని ఓ ప్రాంతమని కైలాశ్ కుటుంబ సభ్యులకు కువైట్ నుంచి సమాచారమందింది. దీంతో మృతుడి తండ్రి బుధవారం డిచ్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే, కువైట్‌లో తన కుమారుడు పట్టుబడ్డాడని తెలిసి తండ్రి ఇక్కడి నుంచి కూడా పరారైనట్లు తెలిసింది. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# “చేపల రైతు చేతుల్లో దేశ ఆహార భద్రత”




ప్రతి సంవత్సరం జూలై 10న భారత దేశం జాతీయ చేపల రైతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుంది. దేశ ఆహార భద్రతకు, పోషకాహార అవసరాలకు తోడ్పడుతున్న మత్స్య రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న లక్షలాది చేపల రైతులు, మత్స్యకారులు, ఆక్వా ప్రెన్యూర్ల అంకిత భావానికి, కృషికి గుర్తింపుగా ఈ దినోత్సవం నిర్వహించ బడుతుంది. ఇది కేవలం ఒక రోజు వేడుక మాత్రమే కాకుండా, దేశ మత్స్య పారిశ్రామిక అభివృద్ధికి దిశానిర్దేశం చేసే ప్రేరణాత్మక దినంగా నిలుస్తోంది.

ఈ దినోత్సవాన్ని జూలై 10న జరుపు కోవడానికి ఒక ప్రత్యేక నేపథ్యం ఉంది. 1957లో ఇదే తేదీన, ప్రముఖ భారతీయ మత్స్య శాస్త్రవేత్తలు డాక్టర్ హీరాలాల్ చౌదరి మరియు డాక్టర్ కె. హెచ్. అలీ కున్ని ఒడిశాలోని అంగుల్‌లో మేజర్ కార్ప్ చేపలపై హైపోఫిసేషన్ అనే శాస్త్రీయ సాంకేతికతను విజయవంతంగా ప్రయోగించారు. ఈ సాంకేతికత ద్వారా చేపల ఉత్పత్తిలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. దీని ఫలితంగా దేశంలో వాణిజ్య ఆక్వాకల్చర్‌కు బలమైన భూమిక ఏర్పడింది. మత్స్య పాలనలో శాస్త్రీయత, ఉత్పాదకత పెరిగి ‘నీలి విప్లవం’కు నాంది పలికింది.

నీలి విప్లవం ఫలితంగా భారత దేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద చేపల ఉత్పత్తి దారుగా నిలిచింది. దేశం మొత్తంలో చేపల ఉత్పత్తిలో సుమారు 65 శాతం వాణిజ్య ఆక్వాకల్చర్ ద్వారానే లభిస్తోంది. 2023–24 సంవత్సరానికి గాను భారత్‌లో చేపల ఉత్పత్తి సుమారు 174 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, వీటిలో 131 లక్షల మెట్రిక్ టన్నులు ఆక్వాకల్చర్ నుంచి లభించాయి. అంతే కాకుండా, దేశీయ మత్స్య ఉత్పత్తిలో భారత్ వాటా ప్రపంచ స్థాయిలో 8 శాతంగా ఉంది. ఈ రంగం దాదాపు 2.8 కోట్ల మంది మత్స్యకారులకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జీవనాధారంగా మారింది.

ఈ రంగంలో ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, తెలంగాణ, కేరళ, గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోని చేపల ఉత్పత్తిలో దాదాపు 35 శాతం వాటాను కలిగి ఉంది. సరైన విధానాలు, సాగు కోసం అనుకూల వాతావరణం, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతుతో ఈ రాష్ట్రాలు మత్స్య రంగంలో అత్యుత్తమ స్థానాలను ఆక్రమించాయి.

కేంద్ర ప్రభుత్వం ‘నీలి విప్లవం’ను మరింత బలోపేతం చేయడానికి ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన వంటి పథకాలను ప్రవేశ పెట్టింది. ఈ పథకం ద్వారా చేపల ఉత్పత్తిని పెంచడమే కాకుండా, పోస్ట్-హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, శీతల భద్రపరిచే భవనాలు, రవాణా సదుపాయాలు, మార్కెటింగ్ మద్దతు వంటి రంగాల్లో అభివృద్ధికి పునాదులు వేశాయి. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళల పాత్రను పెంచడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిచ్చారు. 2023–24లో ఖఓఓూజ కింద దాదాపు -2,500 కోట్ల మేర బడ్జెట్ కేటాయింపులు జరిగాయి.

నూతన ఆవిష్కరణలతో బయోఫ్లాక్, ఆర్సీఆర్ఎస్, ఇంటెన్సివ్ కల్చర్ పద్ధతులు రైతులకు తక్కువ ఖర్చుతో అధిక ఉత్పత్తిని అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. నీటి వనరుల సమర్థ వినియోగం, ఆరోగ్య సంరక్షణ, చేపల నిర్వహణ వంటి అంశాల్లో శాస్త్రీయ మార్గదర్శకాలు ఇవ్వడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు సాగుతున్నాయి.

అయితే, ఈ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు కూడా తక్కువ కావు. నీటి కాలుష్యం, సకాలంలో మార్కెట్ మద్దతు లేకపోవడం, సరైన ధరకే విక్రయానికి అవకాశాలు లేకపోవడం, రవాణా లోపాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు ఇంకా కొనసాగు తున్నాయి. జలవనరుల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలు కూడా తక్షణ పరిష్కారం కోరుకుంటున్నాయి.

జాతీయ చేపల రైతుల దినోత్సవం సందర్భంగా కేంద్రం, రాష్ట్రాల స్థాయిలో అవార్డులు, సన్మానాలు, శిక్షణా శిబిరాలు, ప్రదర్శనలు, సెమినార్లు, ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించడం ద్వారా మత్స్య రంగ అభివృద్ధికి కొత్త దిక్సూచి చూపే ప్రయత్నం జరుగుతోంది. ఈ వేదికల్లో రైతులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు పరస్పరంగా జ్ఞానాన్ని పంచుకుంటూ వ్యవస్థను మెరుగు పరిచే మార్గాలు అన్వేషిస్తున్నారు.

ఈ నేపథ్యంలో జాతీయ చేపల రైతుల దినోత్సవం కేవలం స్మరణ దినంగా మాత్రమే కాక, మత్స్య రంగానికి విశిష్ట దిశానిర్దేశం చేసే ఒక ఉద్యమంగా మారాలి. ప్రతి నీటి రైతు భారత ఆహార భద్రతకు కాపలా దారుడిగా నిలుస్తున్నాడు. వారి శ్రమకు, అంకిత భావానికి గౌరవం తెలుపడమే ఈ దినోత్సవ అసలైన ఉద్దేశం.

జూలై 10... జాతీయ చేపల రైతుల దినోత్సవం



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## మండలి చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సీఎస్ సంజయ్ జాజు



హైదరాబాద్, జులై 9: తెలంగాణ నూతన సీఎస్ సంజయ్ జాజు గురువారం తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ని, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ను వారివారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అతిబిఎ డ ఒనీఇజీశ్రీ ఉబీతిటవబ

ఈ సందర్భంగా మండలి చైర్మన్‌కు, అసెంబ్లీ స్పీకర్‌కు సీఎస్ పుష్పగుచ్ఛం అంద జేసి ,శాలువాతో సత్కరించారు.

అనంతరం వారు సీఎస్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సెక్రెటరీ డాక్టర్ నరసింహా చార్యులు , వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు అండగా భరోసా కేంద్రం

### –కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



కామారెడ్డి, జులై 9: మహిళలు, ఇన్నారులు, బాధితులకు అండగా భరోసా కేంద్రంగా పని చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. పట్టణంలోని భరోసా కేంద్రాన్ని ఎస్పీ రాజేశ్‌చంద్రతో కలిసి బుధవారం సందర్శించారు. సిబ్బందితో మాట్లాడుతూ.. బాధితులకు సత్వర న్యాయం, రక్షణ, పునరావాసం కల్పించడంలో భరోసా కేంద్రం కీలక పాత్ర పోషిస్తున్నదని అన్నారు.అనంతరం బాధితులకు అందుకున్న సేవలు, నమోదైన కేసుల పురోగతి,వివిధ శాఖల మధ్య సమన్వయం. పునరావాస చర్యలు, కౌన్సెలింగ్, న్యాయ సహాయం, వైద్య సేవలు తదితరు అంశాలపై భరోసా కో–ఆర్డినేటర్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో భరోసా కో–ఆర్డినేటర్ కవిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కటకటాల్లోకి కిడ్నాప్ గ్యాంగ్

### 14 మందిని పట్టుకున్న పోలీసులు

వరంగల్, జులై 9:కిడ్నాప్ గ్యాంగ్‌ను కేయూ పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. 2012 సంవత్సరంలో హనుమకొండ నయీంనగర్‌లోని పోటీ పరీక్షల కోచింగ్ సెంటర్‌ను కంచనకుంట్ల సునీల్‌రెడ్డి, హరీశ్‌రెడ్డి, బండారి సదానందం పార్ట్‌నర్ షిప్‌లో ప్రారంభించారు. ఈ క్రమంలో వారి మధ్య విభేదాలు రావడంతో 2017లో సదానందం దాన్ని రూ. 11లక్షలకు తీసుకొని, తన భార్య అనిత పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకొని అకాడమీని పటిష్టం చేశాడు. ఇందులో ఎలాగైనా 50 శాతం వాటా దక్కించు కోవాలని సునీల్‌రెడ్డి కాజీపేట ఏసీపీ తమ్ముడు పింగిళి ప్రదీప్‌రెడ్డిని ఆశ్రయించాడు.

ఈ క్రమంలో జూన్30న ఎర్రగట్టు గుట్ట సమీపంలో వారు తమ అనుచరులతో రెండు కార్లు, మోటర్ బైక్‌పై సదానందంను బలవంతంగా కిడ్నాప్ చేసి ప్రదీప్‌రెడ్డి స్వగ్రామం కమలాపూర్ మండలం శనిగరానికి తీసుకువెళ్లారు.

సదానందంను కొట్టి బాండ్‌పేపర్స్‌పై సంతకాలు తీసుకున్నారు. ఇదేకాకుండా ముఠా సభ్యుల్లో కొందరు సదానందం ఇంటికి వచ్చి అతడి భార్యతో బాండ్‌పేపర్స్ మీద సంతకాలు పెట్టించే ప్రయత్నం చేయగా ఆమె నిరాకరించింది. రెండు రోజుల్లో నీ భార్యతో సంతకాలు పెట్టించాలని, లేకుంటే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని కిడ్నాప్ ముఠా సదానందంను మధ్యాహ్నం వదిలిపెట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ప్రదీప్‌రెడ్డి, అతని అనుచరులు సునీల్‌రెడ్డి ఆఫీస్ వద్ద కేసు గురించి మాట్లాడు కుంటున్నారనే పక్కా సమాచారంతో కేయూ సీఐ రవికుమార్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది 14మందిని అదుపులోకి తీసుకున్నారు. కిడ్నాప్‌లో ఉపయోగించిన రెండు కార్లు, ఒక టూవీలర్, 13 సెల్ ఫోన్లు, స్టాంప్ కాగితాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

## రూ.48 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం

### -గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

వరంగల్, జులై 9: భూపాలపల్లి మండలంలోని పలు గ్రామాల్లో రూ.48 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు గురువారం ప్రారంభించారు. పంబాపూర్‌లో రూ.9 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనం, గొల్లబుద్ధారంలో రూ.9 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులు, శ్యామ్‌నగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రహదారి, మొరంచపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని ప్రజలకు అంకితం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడేలా, రైతులు తమ పొలాలకు సులభంగా చేరుకునేలా నాణ్యమైన రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గ్రామాల అభివృద్ధి, పరిశుభ్రతే రాష్ట్ర ప్రగతికి పునాదులని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి కార్యక్రమాలను పారదర్శకంగా, నాణ్యతతో అమలు చేస్తున్నామని, ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మేడిగడ్డకు పోటెత్తుతున్న వరద .. 85 గేట్లుఎత్తి దిగువకు నీటి విడుదల



ములుగు, జులై 9:జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామంలో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు లో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మి ) బరాజ్ కు వరద పోటెత్తుతుంది.

గురువారం బరాజ్ ఇన్‌ఫ్లో 70,140 క్యూసెక్కుల వరద ప్రవాహం రాగా బ్యారేజ్ లోని మొత్తం 85 రేడియల్ గేట్లు ఎత్తి అంతే మొత్తంలో వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని భారీ నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

## కరూర్ తొక్కిసలాట బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు..

చెన్నై,జులై 9: తమిళనాడు సీఎం విజయ్.. శుక్రవారం కరూర్‌లో పర్యటించనున్నారు. 2025, సెప్టెంబర్ 27వ తేదీన కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో సుమారు 41 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. టీవీకే ప్రచార సభకు హాజరైన జనం.. నటుడు విజయ్‌ను చూసేందుకు ఎగబడ్డారు. అయితే కరూర్ తొక్కిసలాటకు చెందిన సుమారు 32 మంది బాధిత కుటుంబాలకు రేపు సీఎం విజయ్ ప్రభుత్వ ఉద్యోగ అపాయింట్‌మెంట్ ఆర్డర్లను అందజేయనున్నారు. ఈ పర్యటన సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు కూడా ఆయన సాయం చేయనున్నారు. కరూర్ పర్యటనలో మొత్తం 41 మంది కుటుంబాలను సీఎం విజయ్ కలుసుకోనున్నారు. రేపు ఉదయం 11 గంటలకు విమానంలో ఆయన తిరుచ్చి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో కరూర్ వెళ్తారు. కరూర్–సేలమ్ బైపాస్ మార్గంలో ఉన్న అట్లాస్ కళైయరంగ గ్రౌండ్‌లో పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొంటారు. కరూర్ తొక్కిసలాటలో మృతిచెందిన 32 బాధిత కుటుంబాలకు పరిహారం కింద ప్రభుత్వ ఉద్యోగ ఆదేశాలను అందజేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. కరూర్ సమీపంలో 1700 కోట్లతో నిర్మించనున్న ప్రైవేటు నాన్ లెదర్ షూ తయారీ ఫ్యాక్టరీకి సీఎం విజయ్ శంకుస్థాపన చేయనున్నారు. ఈ కంపెనీ వల్ల సుమారు 13 వేల ఉద్యోగాలు కల్పించనున్నారు. సీఎం పర్యటన సందర్భంగా ఆ మార్గంలో బందోబస్తు పెంచారు.

## ఈనెల 11న యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డ్ ప్రమాణ స్వీకారం

నల్గొండ, జులై 9: ఈనెల 11న యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో భవాని శంకర్ వెల్లడించారు. గురువారం ఈవో కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తిరుమల తరహాలో ఆలయంలోని బంగారు వాకిలి వద్ద ఉదయం 11 .37 గంటలకు ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. అనంతరం ప్రెసిడెంట్ సూట్‌లో ట్రస్ట్ బోర్డ్ మొదటి సమావేశం జరుగుతుందని వివరించారు.

ఆలయ ట్రస్ట్ చైర్మన్‌గా ఎం సత్యనారాయణ రెడ్డి , మరో ముగ్గురు సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. ఈ ప్రమాణ స్వీకారానికి మీడియాకు అనుమతి లేదన్నారు. స్వీకారోత్సవం నిరాడంబరంగానే కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులకు ఎవరికి ఆహ్వానం అందజేయలేదని ఈవో వెల్లడించారు. ఒకవైపు దేవస్థానం అధికారులు ఆహ్వాన పత్రికను వీఐపీలకు అందజేస్తూనే మరోవైపు ఎవరికి ఆహ్వానం లేదనడంపై విచిత్రంగా ఉందని స్థానికులు ఆరోపించారు.

## భక్తిశ్రద్ధల మధ్య బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం

### -ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్‌నగర్, జులై 9: మండల పరిధిలోని అడవి వెంకటాపురం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం గురువారం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జే. నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామదేవతలు, కులదేవతల ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖశాంతులు, ఐశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామ అభివృద్ధి, ప్రజల ఐక్యత, సాంప్రదాయాల పరిరక్షణలో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని, ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

శివ–ఆంజనేయ, స్వయంభూ వినాయక స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

అనంతరం గ్రామంలోని శివ–ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే హనుమాన్ గుట్టపై వెలసిన స్వయంభూ వినాయక స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నాయకులు వెంకటాపురం శ్రీనివాస్ యాదవ్, ఉపసర్పంచ్ గోపాల్, సుధాకర్ రెడ్డి, మన్యంకొండ దేవస్థానం కమిటీ సభ్యులు అలివేల, గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ముప్పు నేపథ్యంలో కేంద్రం సన్నద్ధత ముమ్మరం... పరిస్థితిపై ప్రతీ వారం సమీక్షలు

న్యూ ఢిల్లీ, జులై 9:ఎల్ నినో ప్రభావం కారణంగా నైరుతి రుతుపవనాల విషయంలో నెలకొన్న అనిశ్చితిని ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ముందస్తు అప్రమత్తతతో అడుగులు వేస్తోంది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో సమగ్ర ప్రణాళిక, స్పష్టమైన వ్యూహం, క్షేత్రస్థాయి చర్యలతో ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు సిద్ధమైంది. సవాళ్లు ఇంకా ఉన్నప్పటికీ, ప్రభావ తీవ్రతను తగ్గించేందుకు ప్రభుత్వ యంత్రాంగమంతా ముందుగానే అప్రమత్తమై చురుగ్గా పనిచేస్తోంది.

జూన్ నెలలో దేశంలో 33 శాతం మేర వర్షపాత లోటు నమోదైందని, జులై నాటికి పరిస్థితి మెరుగుపడి ఈ లోటు 24 శాతానికి తగ్గిందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఇటీవలి రోజుల్లో దేశంలోని పలు ప్రాంతాల్లో ఆశించిన మేర వర్షాలు కురిశాయని, దీనివల్ల వర్షపాతం తక్కువగా ఉన్న జిల్లాల సంఖ్య 262 నుంచి 178కి తగ్గిందని పేర్కొన్నారు.

న్యూఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం అనంతరం మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, బిహార్, జార్ఖండ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లోని పరిస్థితులను కేంద్రం నిరంతరం నిశితంగా గమనిస్తోందని చెప్పారు. జులై నెలలో వర్షాలు మరింత పుంజుకుంటాయనే నమ్మకం ఉందని, తద్వారా ఖరీఫ్ సాగు వేగవంతం కానుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

దేశంలో ఇప్పటివరకు 350.85 లక్షల హెక్టార్లలో ఖరీఫ్ సాగు పూర్తయిందని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే ఇది సుమారు 91.95 లక్షల హెక్టార్లు తక్కువ అని చెప్పారు. రుతుపవనాలు ఆలస్యం కావడం వల్ల ముఖ్యంగా సోయాబీన్, పత్తి సాగుపై ప్రభావం పడిందని ఆయన పేర్కొన్నారు. వర్షాలు ఆలస్యం కావడం వల్ల వచ్చే నష్టాన్ని తగ్గించుకోవడానికి స్వల్పకాలిక, తక్కువ నీటి వినియోగం గల పంటలైన మొక్కజొన్న, సజ్జలు, పెసలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు.

ఈ వర్షభావ సవాలును ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ నెల నుంచే సన్నద్ధతను ప్రారంభించిందని మంత్రి తెలిపారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) సహకారంతో వర్షపాతం తక్కువగా ఉండే జిల్లాల కోసం ప్రత్యేక అత్యవసర ప్రణాళికలను సిద్ధం చేసి, ముందే రాష్ట్ర ప్రభుత్వాలకు పంపినట్లు చెప్పారు. జూన్ నెలలో దేశవ్యాప్తంగా నిర్వహించిన ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా 1.24 లక్షలకు పైగా అవగాహన సదస్సులు నిర్వహించగా.. వీటి ద్వారా సుమారు 80 లక్షల మందికి పైగా రైతులకు నేరుగా అవసరమైన సలహాలు, సూచనలు అందించినట్లు పేర్కొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.